
కిరణ్ కుమారి
మాంత్రిక దీవి

# మాంత్రికదీవి

అది స్వర్ణపురిలోని రాజమందిరం.

అంతఃపురంలోని తన శయనాగారంలో హంసతూలికా తల్పం మీద పడుకుని మహారాణి కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తుంది. ఎదురుగా ధర్మసేన మహారాజా కూర్చుని. అర్ధాంగి లక్ష్మినే దీనంగా చూస్తున్నారు.

మహామంత్రి, మరికొంతమంది ఆప్తులైన రాజోద్యోగులు, పాన్పు ప్రక్కగా నిలుచుని విచారవదనాలతో వున్నారు.

ఇంతలో—

సేనాధిపతి అక్కడికి వచ్చి, రాజదంపతులకూ, మహామంత్రికి నమస్కరించి, విచార వదనంతో నిలుచున్నాడు.

"సేనాధీ! యువరాజుకోసం వెళ్ళిన వీరభటులు తిరిగి వచ్చారా? చిరంజీవి చంద్రమోహనుడు ఏదైన వార్త పంపించాడా!" అని అడిగాడు మహారాజు.

మహారాణి అవిరళధారాపాతంగా ప్రవహిస్తోన్న కన్నీటి కెరటాలను అదుపులో పెట్టుకోవటానికి ప్రయత్నిస్తూనే ఆశాపూరిత దృక్కులను సేనాని వేపు ప్రసరింపజేసింది.

మహారాజా కూడా ఆత్రంగా సేనాని వేపు చూస్తూ, అతడు చెప్పబోయే మాటలను వినటంకోసం ఆతురతను వ్యక్తం చేశాడు.

"కొంతమంది వచ్చారు ప్రభూ! వాళ్ళు చెప్పిన విషయాలు మనకెంత ఆసక్తికరంగా లేవు. ఇక చంద్రమోహన కుమారుడూ తన ప్రాణ మిత్రుడూ, వేగుపుత్రుడూ అయిన యువరాజుగారిని ఏనాటికైనా కలుసుకుని, వారితోనే తిరిగి రాజధానికి కాలుమోపుతానని శపథంచేసి వెళ్ళాడు కాబట్టి, ఆ చిరంజీవి కార్యసాఫల్యం పొందకపోడు.

ఇప్పుడు మనపాలిట భగవంతుడిలా ఓ యోగిపుంగవులు నాకు దర్శనం యిచ్చి, మన యువరాజుగారిని గురించి కొన్ని భద్రవాక్యాలు సెలవిచ్చారు. వారి దర్శనార్థం మిమ్మల్ని, మహారాణీగారిని, మంత్రిగారిని తీసుకువెళదామని వచ్చాను" అన్నాడు సేనాని.

మహారాజా ఆశ్చర్యం, ఆనందం, కొద్దిగా ధ్వనిస్తోన్న దుఃఖకంఠస్వరంతో "సేనానీ! ఆ యోగీంద్రులు మా చిరంజీవిని గురించి సెలవిచ్చిన భద్రవాక్యాలు ఏమిటి? అవి చెప్పి మా మనస్సుకు కొంతకొంతైనా ఊరట కలిగించు" అన్నాడు.

"ప్రభూ! నేను నా కార్యాలయంలో రాజకార్యాలకూ, సైనికాంశాలకూ సంబంధించిన విశేషాలను పూర్తిచేసుకుని, తమ దర్శనార్థం రాజమందిరానికి వస్తూండగా, కాళికామతల్లి



ఆలయం దగ్గరవున్న సత్రంలో అపూర్వ తేజస్సులతో విరాజిల్లుతోన్న ఓ యోగీంద్రుడు కనిపించాడు. నేను వెళ్ళి ఆ మహాత్ముడికి పాదాభివందనం చేసి, యువరాజుగారి విషయం చెప్పి శోకసాగరంలో వుండే మా రాజదంపతులకూ, మా దేశ ప్రజలకూ ఆనందదాయకంగా మా యువరాజుగారి క్షేమ సమాచారాలు దివ్యదృష్టితో చెప్పమని ప్రార్థించాను.

ఆ మహర్షి కొన్ని క్షణాలు కళ్ళుమూసుకుని, ఏదో ధ్యానించి, తిరిగి నా వేపు చూస్తూ, "సేనానీ! మా తపశ్శక్తులకు పరిమితమైన కొన్ని విషయాలలోనే మేము జోక్యం కలిగించుకోవాలి. కొన్ని కొన్ని విషయాలను ఆయా ప్రాణుల జీవధర్మాలకూ, సృష్టి రహస్యాలకూ విడిచిపెట్టాలి. అయినా, అచంచలమైన రాజభక్తి కలిగిన మనస్సు మీ రాజకుటుంబం కోసం తహతహలాడుతూ అడిగావు కాబట్టి కొన్ని విషయాలను తెలుపుతాను విను.

ప్రస్తుతం మీ రాజపుత్రుడికి వచ్చిన ప్రమాదం ఏమీలేదు. ఆ చిరంజీవి ఒకానొక సత్కార్యాన్ని సాధించటానికి ఇక్కడికి కొన్నివందల యోజనాల దూరంలో ప్రయాణిస్తున్నాడు. తాను సాధించదల్చుకున్న కార్యం పూర్తిచెయ్యాలనే దృఢ సంకల్పంతో పురోగమిస్తున్నాడు" అని చెప్పాడు.

ఆ తర్వాత నేను మరికొన్ని వివరాలు అడగాలనుకున్నానుగాని. అవి మీ ద్వారా అయితేనే మరింతగా తెలుసుకోవటానికి అవకాశం వుంటుందని భావించి వారిదగ్గర సెలవు తీసుకుని వచ్చాను.

అతీంద్రియ జ్ఞానసంపన్నులైన యతీంద్రులు లోక కల్యాణంకోసం తమ తపశ్శక్తినీ, యోగ ఐశ్వర్యాన్నీ ధార

చెప్తారు. కాబట్టి మనం మళ్ళీ వెళ్ళి ఆ మహర్షి పాదాలమీద వ్రాలి యువరాజాగారిని గురించి అడిగితే. ఏమైనా ప్రయోజనం వుండవచ్చునని విశ్వసిస్తున్నాను" అని చెప్పాడు సేనాధిపతి.

మహారాజు వెంటనే మహామంత్రిని చూస్తూ, "మంత్రివర్యా! సేనాని చెప్పినట్లు మనం ఇప్పుడే వెళ్ళి ఆ మహర్షుల దర్శనం చేసుకుందాం పదండి. నా కుమారుణ్ణి గురించి కొన్ని విశేషాలు తెలుసుకోగలిగితే. కొంత మనశ్శాంతి అయినా వుంటుంది" అన్నాడు మహారాజు.

అంతవరకూ తన పుత్రుణ్ణి గురించిన ప్రసక్తిని ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ దుఃఖంతోనూ మిళితమైన ఉత్కంఠతతోనూ వింటూన్న మహారాణి కళ్ళు తుడుచుకుంటూ లేచి కూర్చుని మహారాజుతో "స్వామీ! నా బంగారు తండ్రికి సంబంధించిన వివరాలను ఆ యోగీంద్రులు సెలవిస్తుంటే నేను కూడా వీనులవిందుగా వింటాను. దయచేసి నన్ను కూడా తీసికెళ్ళండి" అంది.

మహారాజు జాలిగా భార్యను చూస్తూ, అలాగే దేవీ! వెళదాం పదండి" అన్నాడు.

## 2

కాళికాలయం ప్రక్కనే వున్న ఓ సత్రం అది. స్వర్ణపురికి వ్యాపారార్థం వచ్చినవారికీ, బాటసారులకూ, దేశం చూడటానికి వచ్చినవారికీ, విశ్రాంతి తీసుకోవటానికి ధర్మసేన మహారాజాగారి పూర్వీకులు నిర్మించిన పెద్ద భవనం ఆ సత్రం.

అందులో ఎన్నో గదులూ, అరలూ వున్నాయి. ఆ సత్రం ఎదురుగానే స్వర్ణపురి రాజమందిరం వుంది.



పరిశుభ్రమైన శ్వేతాంబరాలు ధరించిన ఓ మహర్షి సత్రం మొగసాల ఓ మంటపంమీద కూర్చుని. కాళీ ఆలయం కేసి చూస్తున్నాడు.

ఇంతలో—

మహారాజూ, మహారాణి, సేనాని, సపరివారంగా అక్కడికి వచ్చారు.

సేనాని ముందుగా వెళ్ళి యోగికి నమస్కరిస్తూ ఇలా అన్నాడు—

"స్వామీ! మా మహారాజ దంపతులూ, మా మంత్రి గారూ తమ దర్శనంకోసం వచ్చారు"

యోగి ప్రఫుల్లవదనంతో చిరునవ్వు చిందిస్తూండగా, ప్రక్కకు తిరిగి చూశాడు.

అప్పుడే చేతులు జోడించుకుని, అక్కడికి వచ్చిన ధర్మసేన మహారాజా, మహారాణీ, మహామంత్రి భక్తితో ఆ యోగికి నమస్కరించారు.

పరిజనులు కొద్దిదూరంలో చేతులు కట్టుకుని నిల్చుండిపోయారు!

యోగి చెయ్యెత్తి రాజదంపతులనూ, మంత్రినీ దీవించాడు. వాళ్ళను తన ఎదురుగా కూర్చోమని సూచించాడు.

మహారాజూ, మహామంత్రీ, మహారాణీ ఆ యోగి ఎదురుగా కూర్చున్నారు

సేనాధిపతి వినయంతో యోగి దగ్గరగా నిల్చుండిపోయాడు.

మహారాజు సంజ్ఞ చెయ్యగా అతడు కూడా వచ్చి మహారాజు ప్రక్కనే కూర్చున్నాడు.

"స్వామీ! మీరు మాపట్ల నిర్హేతుకమైన దయతో భద్రతా వాక్యాలు సెలవిచ్చారు. మా మనస్సులు ఆ వార్త విని కొంత సంతృప్తి చెందాయి. మీరు మా పాలిటి దైవంలా సాక్షాత్కరించారని భావిస్తున్నాం. ప్రస్తుతం మా ఏకైక పుత్రుని దూరమై మేము విషణ్ణ మనస్సులతో విలపిస్తున్నాం. మీరు లోక కల్యాణంకోసం పాటుపడే యోగిపుంగవులు దయచేసి మా కుమారుణ్ణి గురించి ఇంకా కొన్ని వివరాలు చెప్పండి. వేటకు వెళ్ళినవాడు వెళ్ళినట్లే మాకు దూరమైపోయాడు" అన్నాడు మహారాజు దుఃఖపూరిత స్వరంతో.

మహారాణి కూడా యోగీంద్రుణ్ణి అలాగే ప్రార్థించింది.

ఆ యోగీంద్రుడు వారిని విశాల శాంత దృష్టులతో చూస్తూ, "పుణ్య దంపతులారా! మీ కుమారుడు లోకోత్తర ప్రతిభాశాలియైన వీరవరేణ్యుడు. అతడికి ఓ కానొక దైవకార్యం నెత్తినపడింది. దానిని నెరవేర్చటానికే వాస్తవం ఎవ్వరికీ చెప్పకుండా వెళ్ళాడు. నేను చెప్పటంకంటె కొన్ని దృశ్యాలను మీకు కళ్ళకి కట్టినట్లు చూపిస్తాను చూడండి" అని యోగీంద్రుడు కమండలంలోని జలాన్ని తీసుకుని మంత్రపూర్వకంగా క్రిందికి జారవిడిచాడు.

మరుక్షణం—

ఆ కమండలంనుంచి జారిన నీటిలోంచి కొన్ని దివ్య కిరణాలు ఆవిర్భవించాయి. అవి మహారాజు, మహారాణి, మంత్రి, సేనాధిపతుల వేపు ప్రయాణించాయి.

అవి అలా ప్రయాణించి, వాళ్ళ ముఖాలముందు తెరలు తెరలుగా విరిశాయి. రాజుకు రాణికి, మంత్రి సేనాపతులకు అక్కడి దృశ్యాలు అంతర్థానమై వాళ్ళ దృష్టిని ఎక్కడికో



తీసుకువెళ్ళింది యోగీంద్రుడి తపశ్శక్తి.

వాళ్ళ కళ్ళకి స్వర్ణపురికి అనతిదూరంలో వున్న కారడవి గోచరించింది.

ఆ అడవిలో—అర్ధరాత్రివేళ—రాకుమారుడైన జయంతుడు తనకోసం ప్రత్యేకంగా నిర్మించబడిన గుడారంలో—

* * *

ఓ పాన్పుమీద పడుకుని హాయిగా నిద్రిస్తున్నాడు. పగలంతా వేటలో అలసిపోయిన అతడు అంతకు ముందు కొద్దిసేపటిదాకా తన ప్రియమిత్రుడు, మంత్రిపుత్రుడు అయిన చంద్రమోహనుడితో ముచ్చటించి, ఆ తర్వాత తన ప్రక్కనే వున్న మరో పాన్పు మీద మంత్రికుమారుణ్ణి నిద్రపొమ్మని చెప్పి, తను కూడా నిద్రకు ఉపక్రమించాడు. చంద్రమోహనుడు గాఢనిద్రలోకి జారుకున్నాడు.

ఆ సమయంలో—

జయంతుడికి ఏదో విచిత్రమైన స్వప్నం రాగా ఆ స్వప్న మధురానుభూతికి నిద్రభంగం చెంది పాన్పుమీంచి లేచి కూర్చున్నాడు.

అప్పుడే అతడి కర్ణపుటాలకు విందు చేస్తూ అపూర్వమైన ఓ కమనీయ రాగం వాయుతరంగాల్లో విహరిస్తూ వచ్చి సోకింది.

అది మానవలోకానికి చెందిన సంగీతంలా అనిపించలేదు అతడికి.

ఆ గానం వింటూనే జయంతుడు గుడారం బయటికి వచ్చాడు. గుడారంచుట్టూ వెండారబోసినట్లు వెన్నెల ప్రకాశిస్తోంది.

అక్కడక్కడ పడుకుని వేటకు వచ్చిన వీరభటులు గాఢ నిద్రలో వున్నారు.

జయంతుడు అటూ ఇటూ చూసేసరికి గుడారం దగ్గర ఓ విచిత్రాకారం కనిపించింది.

ఆ ఆకారాన్ని చూడగానే ఆ రాజపుత్రుడు వులిక్కపడ్డాడు

శరీరమంతా కన్నులకు మిరుమిట్లు గొలిపే బంగారుతో నిర్మించబడినట్లున్న ఓ జింక, ఆ జింక శిరస్సు మాత్రం చందమామలా వున్న అద్భుతసౌందర్యం కలిగిన స్త్రీ ముఖం.

ఆ విచిత్రపు జింక గుడారంలోకి తలత్రిప్పి, విషాద పూర్వకమైన మధురగానం చేస్తోంది.

అంతవరకూ తాను ఎప్పుడూ వినని ఆ విచిత్రపు ఆకారాన్ని చూడగానే జయంతుడిలో ఎన్నో ఆలోచనలు మెదిలాయి

మౌనంగా అక్కడే నిల్చుని, ఆ జింకవేపే చూడసాగాడు జింక అలా పాడుతూనే కొంతసేపటికి గుడారం ముందర వున్న జయంతుడి దగ్గరికి వచ్చింది.

అతడు కూడా అత్యంతాశ్చర్యంతో ఆ జింక దగ్గరికి వెళ్ళాడు అతడు తన దగ్గరికి రాగానే ఆ జింక తన గానాన్ని ఆపుచేసి దీనంగా అతడ్ని చూస్తూ మానవభాషలో రాజపుత్రా! ఆర్తత్రాణ పరాయణుడివైన నీనుంచి ఓ ఉపకారం పొందాలని వచ్చాను. దయచేసి నా వెంటవస్తే నీకొక అపూర్వ దృశ్యాన్ని చూపించి, అందుకు సంబంధించిన చరిత్ర చెబుతాను అంది. సహజ కారుణ్య హృదయం కలిగిన జయంతుడు ఆ జింక అలా చెప్పగానే, కొన్ని క్షణాలు మాత్రమే ఆలోచనలో పడ్డాడు.



"ఆ జింక నిజంగా తనను సహాయం అర్థించటానికే వచ్చిందా, లేక - ఏ మాయావిదైనా ఏ ప్రయోజనాన్నో ఆశించి తనను మోసగించటానికి వచ్చిందా

రెండవ వూహ నిజం కాదనిపించింది. వెంటనే అతడికి. సర్వశాస్త్రవిశారదుడైన ఆ రాజపుత్రుడు మనస్తత్వ శాస్త్రం ప్రకారం ముఖంచూసి మనస్సును వూహించవచ్చునన్న ప్రమాణం ప్రకారం ఆ జింక ముఖాన్ని బట్టి, అది మాయాభావంతో తన దగ్గరికి రాలేదని నిర్ధారణ చేసుకున్నాడు.

ఒకవేళ —

అలా వచ్చినా ఆ మాయలు తనదగ్గర సాగవు తన క్షత్రియత్వానికి అది ఓ పరీక్ష ఆర్తత్రాణపరాయణత్వాన్ని గురించి ఆ జింకే పేర్కొంది అది నిజం కావాలి! తాను ఆ జింక వెంట వెళ్ళి ఆ విశేషమేమిటో తెలుసుకోవాలి!

అలా వూహించి చివరసారిగా తీసుకున్న నిర్ణయం ప్రకారం జయంతుడు చిన్నగా తల వంకించి అలాగే వస్తాను ఒక్క క్షణం ఆగు, అని గబగబా గుడారంలోకి వెళ్ళాడు.

పాన్పుపైన నిశ్చింతగా నిద్రపోతున్న ప్రియమిత్రుడైన చంద్రమోహనుడ్ని కూడా లేపి ఆ విచిత్రం చూడటానికి తనతో కూడా తీసికెళదామనుకున్నాడు. కాని అతడికి నిద్రాభంగ. కలిగించటానికి మనస్కరించలేదు

వెళ్ళి వచ్చిన తర్వాత జరిగింది చెప్పి తన మిత్రుడ్ని ఆశ్చర్యంలో ముంచెయ్యవచ్చుననుకున్నాడు

వెంటనే—

రాత్రి దుస్తులను తీసివేసి యోధవేషానికి సంబంధించిన దుస్తులు ధరించాడు. పాన్పు పక్కనే వున్న కరవాలాన్ని

తీసి ఒరలో ఇముడ్చి ఒరను నడుంకు కట్టుకున్నాడు. ధనుర్బాణాలు తీసుకుని, పాదరక్షలు ధరించి అక్కడ్నించి బయలుదేరాడు.

o o o

ముఖం మాత్రం స్త్రీగా వున్న ఆ బంగారుజింక వెంట జయంతుడి గుర్రం పరుగెత్తుతోంది.

ఆ జింక చెంగుచెంగున దూకుతూ అప్పటికి గుడారం నుంచి కొద్దిదూరం వచ్చి, పంపాసరోవరం ప్రక్కన వున్న ఓ పొదరింటి ముందు ఆగింది

జయంతుడు ఆ జింక దగ్గరగా వచ్చి గుర్రాన్ని నిలువరించి క్రిందికి దిగాడు.

జింక మానవభాషలో —

రాజకుమారా! నన్ను వెంబడించి నా వెంట వచ్చినందుకు కృతజ్ఞతలు. నువ్వు మహా సాహసవంతుడివనీ, అస్త్రశస్త్ర పరాయణుడివనీ, విశ్వసించి నీకోసం వచ్చాను. ఈ పొదరింటిలో నాలాగే నిజరూపం కోల్పోయి వున్న నా ప్రభుపుత్రికను మీరు కాపాడగలరన్న విశ్వాసం నాకు వుంది. దయచేసి మీ నిర్ణయం చెబితే, ఆ తర్వాత మా చరిత్ర చెబుతాను" అంది.

జయంతుడు కాంతగా తీక్షదృష్టులను ఆ జింక ముఖం మీదికి ప్రసరింపజేస్తూ "సోదరీ! నా మీద నువ్వు పెట్టుకున్న ఆశను నా సర్వశక్తులూ వినియోగించి నిజం చెయ్యటానికి ప్రయత్నిస్తాను. మున్నెవరివో నీకీ విచిత్రరూపం ఎందుకు వచ్చిందో నీ స్నేహితురాలెవరో, ఆమెకు కూడా నీలాగే రూపభ్రంశం ఎందువల్ల ఏర్పడిందో మొదలైన వివరాలు



చెప్పు" అన్నాడు.

"అలాగే - ఈ పొదరింటిలోకి రండి."

అని ఆ విచిత్రపు జింక పొదరింటిలోకి నడిచిపోయింది. జయంతుడు కూడా ఆ జింకను అనుసరించి లోపలికి వెళ్ళాడు

పొదరింటి మధ్యలో స్వచ్ఛమైన పాలరాయిలా ప్రకాశిస్తూన్న ఓ అందాల బొమ్మ కనిపించింది.

"రాకుమారా! విధివిధానం కారణమై మా రాజపుత్రిక జీవితంలో నిప్పులు పోయటంవల్ల ఇలా విగ్రహరూపిణియై ఈ పంపా సరోవరం దగ్గర పొదరింటిలో పడివుంది లేకపోతే, చతుర్దశభువనాలలోని కన్యల అన్నిటికీ తలమానిక మైన అమ్మను సార్థకం చేసుకుంటూ హాయిగా స్వర్గలోకంలో వుండేది" అంది జింక.

జయంతుడు ఆశ్చర్య విషాదాలతో ఆ విగ్రహాన్ని కొన్నిక్షణాలు అలాగే చూసి జాలిగా జింకతో, "సోదరీ! ఈ సౌభాగ్యవతి ఎవరు? పద్నాలుగు లోకాలకు తలమానిక మైన జన్మ ఆ పేరేమిటి? ఈ అందాలబొమ్మ ఇలా బొమ్మ కాక ముందు స్వర్గలోకంలో ఎందుకు ఉండేది! ఏ కారణంవల్ల ఇలా విగ్రహరూపిణిగా పడివుంది? అన్నీ వివరంగా చెప్పు" అన్నాడు.

"వినండి. ఈ విగ్రహరూపిణి దేవలోకాలన్నిటికీ రాజధానియైన స్వర్గలోకంలోని అమరావతి రాజమందిరంలో పెరిగిన అపురూపపు అపరంజిబొమ్మ.

దేవేంద్రుడికీ శచీదేవికీ అబ్బిన అందాల బాలిక. పేరు జయంతి. సౌందర్యంలోనూ, సౌశీల్యంలోనూ, వినయ

తానే పాట వినిపించుకుంటూ అన్ని లోకాల భాషలలోనూ పాండిత్యం గడించిన విద్యారూపిణి నేను కింపురుషరాజైన చిత్రకేతుడి పుత్రికను. చిన్నప్పటి నుంచి మా జయంతికి ప్రాణస్నేహితురాలిని.

మేము ప్రతి పౌర్ణమిరోజునా భూలోకంలోని హిమాలయ పర్వతాలలోనూ, మేరుపర్వతాలలోనూ, ఇంకా అపురూపమైన అందాలు విరజిమ్మే ప్రదేశాలలోనూ, రాత్రివిహారానికి వస్తూండేవాళ్ళం. కామరూపం, కామగమనం కలిగిన మేము తెల్లవారేదాకా భూలోకంలో విహరించి ఆ తర్వాత మా లోకాలకు వెళుతూండేవాళ్ళం

ఇలా వుండగా—

ఒక పౌర్ణమినాడు నేనూ, మా జయంతీ, కొంతమంది స్నేహితురాండ్రతో కలిసి భూలోక విహారానికి వచ్చాం. ఆ దినం చిత్రకూటపర్వతంలో విహరించాలని అనుకుని అక్కడే దిగాం.

అవతారపురుషుడైన శ్రీరామచంద్రుడు సీతమ్మతల్లితో కలిసి పర్ణశాల నిర్మించుకుని కొంతకాలం ఆ చిత్రకూట పర్వతంలో గడిపాడు.

మేము ఆ పవిత్ర పర్వతంలో ఆయా పుణ్యస్థలాలను సందర్శించుకుంటూ, అక్కడక్కడ మనస్సునానందింపచేసే జలపాతాలనూ, సుందరనందనోద్యానవనాలనూ, దర్శిస్తూ విహరిస్తూండగా - ఓ అపురూపమైన పుష్పవృక్షం మాకు కనిపించింది.

మా జయంతి ఆ వృక్షంలోని పుష్పాల సౌందర్యానికీ, సౌరభానికీ ముగ్ధురాలై నాతో, "చిత్రా! ఆ పుష్పాలు ఎంత మనోహరంగా వున్నాయో చూశావే! ఇవి మన దేవలోకా



ల్లోని పుష్పాలకంటే అపురూపంగా వున్నాయి. కొన్ని పుష్పాలు కోసుకుని వెళదాం" అంది.

నేను అంగీకరించగా మా స్నేహితురాండ్రతో కలిసి ఆ చెట్టుదగ్గరికి వెళ్ళాం. అందరం అలా ఒక వేపు చేరి పూలు కోసుకోవటం ప్రారంభించాం.

ఆ చెట్టుకొమ్మలు బాగా క్రిందికి వంగి వుండటం వల్ల మేము ఎక్కువ శ్రమపడకుండానే పూలు కోసుకుంటున్నాం.

మా జయంతి ఉత్సాహం కొద్దీ తను కూడా పుష్పాలను కోయటానికి చెట్టు దగ్గరికి వచ్చింది. ఆమె ఓ కొమ్మను పట్టుకోబోయా అది అందనందున చెట్టు మొదలుకు దగ్గరలో వున్న ఓ పుట్టమీదికెక్కి పూలు కోయటం ప్రారంభించింది.

కొన్ని క్షణాలలోనే—

ఆ పరిసరప్రాంతం నుంచి, "ఓసీ! గర్వోన్మత్తురాలా! ఏమిటి నీ కండకావరం! మహర్షినైన నా పట్ల నువ్వు చూపించవలసిన విధేయత ఇదేనా? నా భుజాలమీదకెక్కి పువ్వులు కోసుకుంటావా? ఇందుకు తగిన ఫలితం అనుభవిస్తావు చూడు."

—అన్న మాటలు వినిపించగానే మేమంతా భయపడుతూ క్రిందికి చూసుకున్నాం

కాని, మా కాళ్ళు భూమిమీదే వున్నాయి. నేను నా స్నేహితురాండ్ర కాళ్ళవేపు చూశాను.

వాళ్ళ కాళ్ళు కూడా భూమిమీదే వున్నాయి. అప్పటికే నా స్నేహితురాండ్రు జయంతి పాదాలవేపు చూసి భయంతో గజ గజలాడుతూండటం చూసి నేను కూడా చూపులను అటుకేసి సారించాను.

అప్పటికి జయంతి కూడా ఆ మాటలు వినటం వల్ల తలను క్రిందికి వాల్చింది.

ఆ పట్టు చెల్లాచెదురు కాగానే అక్కడ తపస్సు చేసుకుంటున్న ఓ ముని కనిపించారు.

బాహ్యేంద్రియాలను మరిచి నియమ నిష్ఠతో వున్న ఆ మహర్షి ఎంతకాలం నుంచి అలా తపస్సు చేస్తున్నారో, ఏమో. ఆయన చుట్టూ పుట్ట ఏర్పడి అది పెరిగి తనను పూర్తిగా కప్పివేసిన తెలుసుకోలేకపోయారు.

మా జయంతి పాదాలు సరిగ్గా ఆ మునీశ్వరుడి రెండు భుజాల మీద వున్నాయి

ఆమె వెంటనే భయాందోళనలతో క్రిందికి దిగి ఆ మునికి నమస్కరించింది.

మేము పరుగు పరుగున అక్కడికి చేరుకున్నాం. మునీంద్రుడికి నమస్కరించాం.

"స్వామీ! నా అపరాధం క్షమించండి" అని ఇంకా ఏదో చెప్పబోతోన్న మా జయంతిని తీవ్రంగా చూస్తూ ఆ ముని,

"ఛీ! ఏ అపరాధాన్ని క్షమించాలా? ఏదో ప్రయోజనాన్ని ఆశించి నాకు తపోభంగం కలిగించటానికి వచ్చిన నువ్వు ఇలా భూపతివై పంపా సరోవర ప్రాంతంలోని ఓ పొదరింటిలో పడివుండు" అని మంత్రవాక్కుతో ధృవం చేసి అతి భయంకరంగా శపించారు

నేను అతడి కొంపరపాటుకు ఆగ్రహంతో ఏం మాట్లాడుతున్నానో తెలీని ఉన్మత్తత మనస్సును ఆవరించుకోగా—

"ఓయీ, జడదారీ! నీ...." అని ఇంకా ఏదో అనబోతోన్న నన్ను ఆ పైన మాటలు అనవివ్వకుండా చేసి మునీం



ద్రుడు కోపాగ్ని వీచికలు ప్రజ్వరిల్లుతోన్న దృష్టులతో నన్ను చూస్తూ ఇలా అన్నాడు—

"దురహంకారీ! చేసిన అపరాధానికి పశ్చాత్తాపం చెందకుండా, కండకావర కొద్ది తారతమ్య జ్ఞానం విస్మరించి ఇంకా నామీద దూషణ భాషణాలు చెయ్యాలనుకుంటున్నావా? నీ కండకావరం కూడా అణిగిపోతేగాని, నాకు శాంతి వుండదు. ఈ యువతిలాగే నువ్వు కూడా అక్కడే ఇలా భూపతివై పడివుండు" అని నన్ను కూడా శపించాడు.

మా స్నేహితురాండ్రు మా జయంతికి. నాకూ ఆ ముని అలా శాపం ఇవ్వగానే హాహాకారాలు చేశారు.

నేను ఆ మునీశ్వరుడి పాదాలమీద వ్రాలి "స్వామీ! మా ప్రభు పుత్రికను ఇలా దారుణంగా శపించారన్న ఆవేశంతో మిమ్మల్ని దుర్భాషలాడబోయాను. నాకు శిక్ష విధిస్తే విధించారుగాని, ఈ అమాయకబాలికి మాత్రం ఈ క్రూర దండన విధించవద్దు ఈమె దేవతా సార్వభౌముడైన దేవేంద్రుడి ఏకైక పుత్రికయైన జయంతి ఈ జవరాలు పొరబాటున మీ పట్ల అపచారం చేసిందేగాని, బుద్ధిపూర్వకంగా చేసిందేమో మీ దివ్యదృష్టిని ప్రసరింపజేసి తెలుసుకోండి" అని ప్రార్థించాను.

ఆ మునీంద్రుడు దివ్యదృష్టితో క్షణాలమీద జరిగిందంతా తెలుసుకున్నాడు.

ఆయన కళ్ళు ద్రవించిపోయాయి.

మనస్సు కరుణాపూరితం అయింది.

వెంటనే జయంతివేపు తిరిగాడు అతడు.

"స్వామీ! నువ్వు చేసిన పొరపాటుకు నా తొందరపాటు తోడై దారుణమైన శిక్షను విధించింది. నువ్వు తెలియక చేసిన తప్పిదానికి కఠినంగా శాపం ఇచ్చాను. శాపాన్ని ఉపసంహరించలేనుగాని, విముక్తి మార్గం ఉపదేశిస్తాను విను" అని శాప విమోచనాన్ని ఇలా చెప్పాడు—

"నువ్వు ఇప్పటినుంచి శిలా స్వరూపిణివై పంపా సరోవర ప్రాంతంలో వుండగా, నీ ఆత్మ ఈ భూలోకంలోని ఒకానొక రాజచంద్రుడికి పుత్రికగా జన్మిస్తుంది. ఆ సౌభాగ్యవతి యౌవనం పొందే సమయంలో కొన్ని విచిత్రకరములైన మార్పులు జరిగి, నీ శాప విమోచనానికి దారితీస్తాయి.

"అయితే—

ఆ సమయం సమీపించినప్పుడు ఒకనాడు నీ స్నేహితురాలైన ఈ చిత్రకు ఓ విశేషం గోచరింపజేస్తాను. ఈమె తన దానవత్వంతోనూ మంత్రశక్తితోనూ, ఓ మహావీర పురుషుడిద్వారా నీకు శాపవిముక్తి చేయిస్తుంది. ఆ క్షత్రియ రాజవంశంలో జన్మించిన ఒకానొక యువకుడు తన ధైర్య సాహసాలను ప్రదర్శించి, సప్తసముద్రాల అవతల జంబూ ద్వీపంలో వుండే అగ్నిసరస్సులోని వైశ్యాపరపుష్పాన్ని సాధించి, ఆ పుష్పాన్ని నీ శిరస్సుకు సోకిస్తే నీకు శాప విమోచనం కలుగుతుంది.

ఆ మహాపుష్పం సప్తఋషుల చేత ఆ అగ్నిసరస్సులో ప్రపంచ శ్రేయస్సు కోసం సృష్టింపబడింది. ఆ మహాకార్యానికి పూనుకోబోయే రాజపుత్రుడికి దైవబలం వుంటుంది. దేవతల అనుగ్రహం లభిస్తుంది. అతడి సాహసబలపరాక్రమాలకు అవి తోడ్పడి, సహకరిస్తాయి.



ఇక—

ఈ విషయం నీ తల్లిదండ్రులకు చెప్పటానికి నీ స్నేహితురాలిగా తను పంపింది, నువ్వు నా శాపఫలితం అనుభవించటానికి వెళ్ళు తల్లీ! నీ భవిష్యత్తు ప్రయోజనం కోసం నా దీవెనలు ఎప్పుడూ వుంటాయి."

అని శాపవిమోచనం అనుగ్రహిస్తూ ఆ ముని మమ్మల్ని దీవించి, తిరిగి ధ్యాననిష్ఠలో మునిగిపోయాడు.

ఆ తర్వాత మా జయంతి తనకు తటస్థించిన దురవస్థను తన తల్లిదండ్రులకు తెలియజేయమని మా స్నేహితురాండ్రకు చెప్పి, కన్నీరుమున్నీరుగా దుఃఖిస్తున్న వాళ్ళను ఓదార్చి శాపఫలితం అనుభవించటానికి నాతో కలిసి ఈ పంపాసరోవర ప్రాంతంలోని కొండరాతి దగ్గరికి వచ్చింది. వెంటనే మేమిద్దరం విగ్రహరూపిణులమయ్యాం.

ఇప్పుడు నాలో ఆ మహర్షి సంకల్పశక్తి ప్రవేశించి, నాకీ విచిత్ర రూపాన్ని అనుగ్రహించి, మీదగ్గరికి పంపించింది. జరిగిందంతా మీకు చెప్పాను.

ఇక—

నాకు మళ్ళీ విగ్రహరూపం ఏర్పడుతుంది. మీరు దయా స్వరూపులు. మా జయంతిని ఈ దుర్దశ నుంచి కాపాడగల సమర్థులు. నేను మనవి చెయ్యవలసిందంతా చేశాను. ఇక మీ ఇష్టం"

అని చెప్పి చిత్ర తీవ్రంగా జయంతి విగ్రహం దగ్గరికి వెళ్ళి తను కూడా విగ్రహంగా మారిపోయింది.

జయంతుడు ఆ విగ్రహాలను అలాగే చూస్తూ కొంతసేపు ఆలోచించాడు.

చతుర్దశభువనాలకు పాలకుడైన దేవేంద్రుడి పుత్రికకు ఏర్పడిన దురవస్థ తనవల్ల తొలగిపోతుందని శాపం ఇచ్చిన మహర్షి చెప్పటంలో అంతర్యం ఏమిటో అతడికి అర్థం కాలేదు.

తాను ఒకానొక సామాన్య మానవకుమారుడు! ఎక్కడో సప్తసముద్రాల అవతల వున్న జంబూద్వీపానికి ఎలా వెళ్ళాలి! ఏ అతీత దివ్యశక్తుల సహకారంవల్ల తాను ఈ కార్యభాగాన్ని సాధించగలడు

అయితే -

తనమీద విశ్వాసం పెట్టుకుని చిత్రలేఖ తీసుకువచ్చింది దేవేంద్రుడి గారాల పుత్రికయైన జయంతికి శాపవిమోచనాన్ని తాను కలిగించి తీరాలి ఇది సృష్టి తన మీద మోపిన బాధ్యత!

మరి—

తన తల్లిదండ్రులు తన మీద ఎన్నో ఆశలు పెట్టుకుని వున్నారు. తన అంతర్థానం గురించి వివరాలు తెలియక వారెంతగా కుమిలిపోతారో!

అయితే ఈ దేవరహస్యాన్ని తన ప్రాణమిత్రుడైన మంత్రికుమారుడితో కూడా చెప్పకూడదు.

చెబితే అతడు తన ప్రయాణానికి ఎంత మాత్రం అంగీకరించడు.

ఏది ఏమైనా, ఈ సాహసకార్యంలో తాను ఒక్కడే ప్రయాణించాలి.

పంచభూతాలుగా, అనంత ప్రకృతిశక్తులుగా పరిణమించినా తన శక్తిసామర్థ్యాలను ధారపోసి, జయంతికి శాపవిమోచనం కలిగించాలి.

మనోబలంవల్ల, శక్తిసామర్థ్యాలవల్ల, మానవుడు



సాధించలేనిదంటూ ఏదీలేదు.

దేవలోకాలను కలతపెట్టే రాక్షసులను హతమార్చి, ఆ లోకాలవారికి రక్షణ కలిగించింది అర్జునుడేకదా? అతడు మానవుడు కాడా?

చివరి ఆలోచన జయంతుడికి వెయ్యి ఏనుగుల బలాన్ని, కొండంత వుత్సాహాన్ని ఇచ్చింది

అక్కడినుంచి బయలుదేరి, బయటికి వచ్చాడు దగ్గరగా వున్న ఓ భూర్జపత్ర వృక్షం దగ్గరికి వెళ్ళి ఓ ఆకు కోశాడు. బాణం అలుగుతో, ఏవెన్నెల వెలుగులో - ఆ భూర్జపత్రంమీద ఏదో వ్రాశాడు. ఆ తర్వాత దానిని బాణపు అలుగుకు బిగించి కట్టాడు.

తూణం నుండి ధనుస్సు తీసుకుని, ఎదురుగా దృష్టిని సారించాడు.

పంపాసరోవరానికి దగ్గరగా వున్న తన సైనిక గుడారం స్పష్టంగా కనిపించింది. ఆ గుడారం ముందున్న ఓ చెట్టు రాజపుత్రుడి దృష్టిని ఆకర్షించింది.

వెంటనే -

బాణాన్ని ధనుస్సుకు అనుసంధానంచేసి, ఆకర్ణాంతం తిగిచి లాగి, ఆ చెట్టుకేసి విడిచాడు

బాణం రివ్వున ముందుకు దూసుకుంటూ వెళ్ళిపోయింది.

జయంతుడు కోదండాన్ని తిరిగి భుజదండానికి అమర్చుకుని, అశ్వం దగ్గరికి నడిచాడు.

అశ్వాన్ని అధిరోహించి, పక్కకు త్రిప్పి ముందుకు దూకించాడు.

# 3

తెల్లవారింది.

పైన ఓక గుడారంలో నిద్రిస్తోన్న చంద్రమోహనుడు నిద్ర లేచాడు. అప్పటికే కొంతమంది భటులు అతడి పాన్పు దగ్గరగా నిల్చుని, చేతులు కట్టుకొని వున్నారు.

చంద్రమోహనుడు తన పాన్పు ప్రక్కన యువరాజు లేకపోవటాన్ని విస్మయిస్తూ "యువరాజుగారు ఏరీ!" అని అడిగాడు.

చిత్తం. మేము కూడా ఆ విషయమై ఆలోచిస్తూ ఏ నిర్ణయానికీ రాలేక తమతో మనవి చేయటానికే ఇక్కడ వేచి వున్నాం. యువరాజుగారికి స్నానాదులు ఏర్పాట్లు చేసి వచ్చి చూస్తే. వారు పాన్పుమీద లేరు. ఏమి తోచక అలా బయట తిరుగుతున్నారేమోనని గుడారం చుట్టు ప్రక్కల ప్రదేశాలన్నీ వెతికాం. చివరకి వారి ఆయుధాలుగాని, గుర్రంగాని, కనిపించకపోవటంతో ఈ సంగతి మీకు చెప్పటానికి ఇలా వచ్చాం" అన్నాడు ఓ భటుడు.

పిడుగుపాటు వంటి ఆ మాటలు వినగానే చంద్రమోహనుడు పాన్పుమీంచి దిగ్గున లేచాడు.

భటుడు చెప్పినట్లు యువరాజు ఆయుధాలుగాని, గుడారం బయట గుర్రంగాని లేకపోవటం అతడి ఆందోళనకు కారణమైంది.

"ఏమయ్యారు? ఎవరికీ చెప్పకుండా ఎక్కడికి వెళ్లారు! అంత అవసరం ఏమొచ్చింది!"

అని చంద్రమోహనుడు పిచ్చివాడిలా గొణుక్కోవటం ప్రారంభించాడు.



ఆ సమయంలో—

ఓ భటుడు ఎదురుగా వున్న ఓ చెట్టుకేసి చూపి "మహామంత్రి పుత్రా! అదిగో ఆ చెట్టు మొదలుకు యువరాజుగారి బాణం గుచ్చుకొని వుంది. ఆ బాణ ప్రయోగపు నేర్పు మన యువరాజుగారిలో గాక ఈనాటి రాకుమారులలో మరొకరికి లేదు. అదీగాక, ఆ బాణపు అలుగుకు ఏదో తాళపత్రపు ఆకు బిగించబడి వుంది" అన్నాడు.

చంద్రమోహనుడు కూడా అటుకేసి చూసి ఆశ్చర్యంతో "భద్రా! నువ్వు వెళ్ళి ఆ బాణాన్ని ఇలా తీసుకురా" అన్నాడు.

ఆ భటుడు వెళ్ళి ఆ బాణాన్ని తీసుకొని వచ్చి చంద్రమోహనుడికి ఇచ్చాడు.

అలుగుకు కట్టబడిన తాళపత్రాన్ని తీసుకొని చంద్రమోహనుడు అక్కడి భటులు వింటూండగా ఇలా చదవటం ప్రారంభించాడు.

"ప్రియమిత్రుడు చంద్రమోహనుడికి—

మిత్రమా!

రాత్రి నాకు ఓ విచిత్రమైన కల వచ్చింది. ఆ తర్వాత [illegible] ఆ కలలో గోచరించిన సంఘటనలాంటివి కొన్ని సంఘటనలు జరిగాయి. వాటిని నీకు నేను తిరిగివచ్చిన తర్వాత వివరంగా చెబుతాను. ఈలోగా నువ్వు నా కోసం ఆందోళన చెందకుండా వుండాలి సుమా! ఒకానొక దేవ రహస్యాన్ని ఛేదించటానికి నేను జంబూద్వీపానికి వెళుతున్నాను.

ఈ విషయంలో నువ్వు నిశ్చింతగా వుండు. నా కార్యసాధనకు భగవంతుడు తోడ్పడగలడన్న నమ్మకం నాకు వుంది. ఇక నా కోసం వెదికించవద్దని నా తల్లిదండ్రులకు

మనవి చెయ్యి. అతి విచిత్రమైన కార్యభారం భగవంతుడు నా మీద మోపినందున నేను వెళుతున్నాను. నువ్వు నట భటులను తీసుకుని వెంటనే రాజధానికి వెళ్ళు! నేను కార్య సాధకుడినై వస్తాను.

ఇట్లు,
నీ మిత్రుడు,
జయంతపాలుడు,
స్వర్ణపుర యువరాజు."

చంద్రమోహనుడు ఆ ఉత్తరం పూర్తిగా చదవగానే భటులు హాహాకారాలు చేశారు.

"అయ్యో, మిత్రమా! మామీద ఇంత దయమాలి ఎందుకు ప్రవర్తించావయ్యా? నువ్వు లేకుండా మేము రాజధానికి ఏ ముఖం పెట్టుకుని వెళ్ళగలమనుకున్నావు? నీతో కూడా మేమూ వచ్చేవాళ్ళం కదా? ఆ జంబూద్వీపం ఎక్కడుందో ఏమో!" అని చంద్రమోహనుడు పరిపరివిధాలుగా విచారించసాగాడు.

చివరకు అతడు ఓ నిర్ణయానికివచ్చి భటులను రాజధానికి వెళ్ళమని చెప్పి, తాను యువరాజుగారితోనే తిరిగి వస్తానని శపథం చేసి అక్కణ్ణుంచి విషణ్ణ హృదయుడై అశ్వారూఢుడై బయలుదేరి వెళ్ళిపోయాడు.

• • •

జయంతుడి గుర్రం అడవులనూ, కొండలనూ, పల్లెలనూ, పట్టణాలనూ అతిక్రమిస్తూ, నిర్విరామంగా ప్రయాణం చేస్తోంది.

అతడు అక్కడక్కడ విశ్రాంతి తీసుకుంటూ, మొదటి సముద్రమైన దక్షిణ సముద్రం వైపుగా ప్రయాణిస్తూ, నెల రోజుల తర్వాత ఓ భీకరారణ్యంలో ప్రవేశించాడు.



ఆ అడవిలో వెళుతూండగా, ఓ కాళికాలయం కనిపించింది. అప్పటికి రాత్రి కావటంవల్ల ఆ ఆలయంలో విశ్రాంతి తీసుకుందామని గుర్రాన్ని అటుకేసి నడిపించాడు.

అలా కనిపించిన దృశ్యాలు ఆ తర్వాత జయంతుడు కాళికాలయంలోకి వెళ్ళడం, అక్కడ ఓ కపట సన్యాసి అతడికి కనిపించడం. తనను బలిపెట్టబోయే సమయంలో తనే యుక్తిగా ఆ సన్యాసిని బలిపెట్టి, కాళీమాతవల్ల దివ్య విద్యలు సంపాదించటం, ఆ తర్వాత ప్రయాణం, దక్షిణ సముద్రతీరం చేరడం ఆ దాపునే వున్న బ్రహ్మాండమైన మర్రిచెట్టు మీద ఒక భయంకరమైన కొండచిలువకు ముసలి గండభేరుండానికి జరిగిన భీషణ పోరాటంలో తీవ్రంగా గాయపడ్డ గండభేరుండం కొనవూపిరితో క్రిందపడటంతో అప్పటి వరకు ఆ హింసాకాండను వీక్షించిన జయంతుడు ఆ దుష్ట సర్పాన్ని ప్రాణాలతో ఉండకూడదనే నిశ్చయానికి వస్తాడు.

వెంటనే కాళీదేవి వరప్రసాదంతో తను పొందిన శక్తులలో ఒకటైన పరకాయప్రవేశ మహావిద్యతో తన శరీరాన్ని మర్రిచెట్టు తొర్రలో భద్రపర్చి గండభేరుండంలో పరకాయ ప్రవేశం చేసి కొండచిలువను హతమార్చటం—అంతలో కొండచిలువ శరీర శకలాలు మాయమై ఆ స్థానంలో నవ మంగళ మనోహరరూపంతో ఒక దేవకన్య సాక్షాత్కరించి తన శాపవృత్తాంతాన్ని జయంతపాలునికి చెప్పి అతనికి ఒక హారాన్ని బహూకరించి, అవసరం కలిగినప్పుడు హారాన్ని స్పృశించి "మదనమంజరీ" అని తన పేరు తల్చుకొంటే మరుక్షణం ప్రత్యక్షమవుతానని చెప్పి జయంతునివద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోవటం—ఆ తర్వాత గండభేరుండ రూపం

దైవ ఆయుంతుడు సముద్రం మీదుగా ప్రయాణించటం మొదలైన దృశ్యాలు వివరంగా కనిపించాయి.

అంతటితో యోగి సంకల్పశక్తి తిరోధానం కావటంవల్ల మహారాజుకూ, మహారాణికీ, సేనాధిపతికీ ఆ దృశ్యాలు చెదిరిపోయాయి.

అంతవరకూ ఉత్కంఠతతో తమ కుమారుడి వివరాలు తెలుసుకున్న మహారాజు యోగీంద్రుణ్ని ఉద్దేశించి, "స్వామీ! మీ దివ్యదృష్టివల్ల మా పుత్రుణ్ని గురించి ఇక్కడుండి జరిగిన విషయాలు తెలుసుకోగలిగాం.

మా చిరంజీవి వేటకు వెళ్ళినవాడు వెళ్ళినట్లు అంతర్ధానం కావటంతో ఇంత దైవ రహస్యం ఇమిడివుందని, అటువంటి గొప్ప కార్యాన్ని సాధించటానికి వెళ్ళాడనీ, ఊహించలేకపోయాం మేము.

అయినా—

ఇప్పటికీ మా మనస్సులు కీడును శంకిస్తూ వున్నాయి. సప్త సముద్రాల అవతలికి వెళ్ళి ఆ దూర ద్వీపంలోని వైశ్వానరసస్యాన్ని మా చిరంజీవి తీసుకువచ్చి దేవేంద్రుడి పుత్రికకు శాపవిముక్తిని కలిగించగలడా!" అని ఆంతరంగం ఆందోళన అతిశయిస్తూండగా ఏదేదో అడగబోయిన మహారాజును చిరునవ్వుతోనే తల అడ్డంగా వూపి వారిస్తూ, "మహారాజా! మీ కుమారుడికి సంక్రమించిన దివ్యవిద్యలు సామాన్యమైనవి కావు. వాటివల్ల ఆ చిరంజీవి ఎంతటి ఘనకార్యాలనైనా సాధించగలడు. ఇక విచారం విడిచిపెట్టి ఆ చిరంజీవి శ్రేయస్సు కోరుతూ, కాళీమాతను ఉపాసిస్తూ వుండండి. దయాంతరంగిణియైన ఆ జగన్మాత దయవల్ల



మీకు పుత్రసందర్శనం కలుగుతుంది.

అంతెందుకు?

నేను శపించిన గంధర్వకన్యకు మీ కుమారుడివల్ల శాపవిముక్తి కలిగిందా, లేదా? ఆ దృశ్యాన్ని మీరు కళ్ళారా చూశారు కదా! ఇంకా ఆందోళన ఎందుకు? ఆ యింతికి శాపం ఇచ్చిన మునీంద్రుడి వాక్కు కూడా ఫలిస్తుంది" అన్నాడు.

మహారాజా, మహారాణి, మంత్రి, సేనాని అంతవరకైనా జయంతుణ్ని గురించిన విశేషాలు తెలుసుకున్నందుకు సంతోషిస్తూ, యోగీంద్రుడికి మరో మారు తలలు వంచి నమస్కరించారు

## 4

ఆ లేడి చెంగుచెంగున గంతులువేస్తూ గుడారానికి ఎదురుగా పరుగెత్తుతూ వస్తూండటం చూసి రాకుమారి అలాగే నిల్చుండిపోయింది.

ఉదయసూర్యుడి కిరణాలకు ఆ లేడి శరీరం బంగారపు నీటిలో మునిగి వచ్చినట్లు ప్రకాశిస్తోంది.

అది చెవులు రిక్కించుకుని చిన్న చిన్న పొదలను, పుట్టలను లంఘించుకుంటూ, తిన్నతిన్నగా గుడారానికే చేరువ అవుతూండటంవల్ల దాని ముఖంలో గోచరిస్తోన్న అనంతాశ్చర్యాలను గమనిస్తూ, తాను కూడా ఆ లేడికి ఎదురుగా నడిచింది రాజపుత్రి.

ఆ లేడి దగ్గరికి రాగానే రాకుమారితో తనకెంతో పరిచయం వున్నట్లు ముఖాన్ని ముందుకు సాచింది. ఆమె ఆ లేడిని మెడ చుట్టూ చేతులువేసి కౌగలించుకుని తండ్రి దగ్గరికి తీసుకెళ్ళింది.

"నాన్నగారూ! ఈ లేడి ఎంత అందంగావుందో చూడండి దీని శరీరం అచ్చం బంగారంతో చేసినట్లుంది కదూ!" అంది రాకుమారి తండ్రితో.

మంత్రి ఆ లేడిని చూస్తూ "అవును మహారాజా! ఇది మన లోకానికి చెందిన లేడిలా లేదు. ఏ దేవ లోకానికో చెందినట్లుగా వుంది" అన్నాడు.

"దేవలోకాలకు చెందినదైతే ఇలా భూలోకానికెందుకొస్తుంది మంత్రిగారూ! అసలు బంగారు లేడిని గురించి మనం రామాయణంలో విన్నాం గాని, ఎన్నడైనా చూశామా! ఇదేదో మాయగా వుంది. దీనిని దగ్గరకు చేర్చటం అంత మంచిది కాదేమో?" అన్నాడు సేనాధిపతి.

లేడి అతడివేపు బెదురుగ్గా చూసింది.

రాకుమారి ఆ లేడి ముఖాన్ని ముద్దులాడుతూ "సేనాపతి తన దృష్టి వదిలించినట్లుందే? ముద్దులు మూటలుగట్టే ఈ లేడిని గురించి మాయ గీయ అంటున్నారు" అంది

సేనాధిపతి అంతలోనే తప్పుకుని "అలాకాదు అమ్మాయిగారూ! ఆశ్చర్యకరమైన వస్తువుగాని, ప్రాణిగాని కనపడినప్పుడు నా కేమిటి, ఎవరికైనా ఇలాంటి అనుమానమే రావచ్చు. అలనాడు సీతాదేవి ఇలాంటి బంగారులేడి కోసం ముచ్చటపడే కదా, అన్ని కష్టాలను అనుభవించింది" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

మంత్రి సేనాధిపతి మాటలకు విసుగు చెందుతూ, "అబ్బా! అమ్మాయిగారు ముచ్చటపడి చేరదీసుకున్న ఈ లేడిని గురించే ఇలాంటి అమంగళకరవాక్యాలు ఎందుకయ్యా! పోనీ, నువ్వన్నట్లు ఈ బంగారు లేడి ఏదో ఆశ్చర్యకరమైన



దైనా, ఈ ప్రపంచంలో ఆశ్చర్యకర సంఘటనలు ఎన్ని జరగడంలేదు? వాటిలో ఇదీ ఒకటి" అన్నాడు.

"అవును. ఏది ఏమైనప్పటికీ ఉదయాన్నే ఈ బంగారు లేడి లభించడం చాలా శుభసూచకంగా భావిస్తున్నాం మేము" అన్నారు మహారాజు కూడా ఆ లేడి వీపు మీద చెయ్యివేసి నిమురుతూ

ఆ తర్వాత—

అప్పటికి లేడి రాకుమారికి బాగా మచ్చిక అయినట్లు తన అందమైన నోటితో ఆమె చేతులను ఆప్యాయంగా పుణక పోగింది.

"ప్రభూ! మనం మీ అన్నయ్యగారైన కీర్తిపాల మహారాజుగారి రాజధానికి వెళ్ళి చాలా రోజులైంది. ఇప్పటికే కొన్ని రాజకార్యాలు, పౌరకార్యాలు పేరుకొనిపోయి వుంటాయి. రాత్రివేళ ప్రయాణం సాగించటమెందుకని ఈ అడవిలో విశ్రాంతికోసం ఆగాం. ఇక మనం వెంటనే ఇక్కడ్నుంచి బయలుదేరటం మంచిది" అన్నాడు మంత్రి.

"అలాగే చేద్దాం. ఇక్కడ్నుంచి మన రాజధాని ఇంకా ఆమడన్నరదూరం వుంటుంది. మధ్యాహ్నానికి మనం వూరు చేరుకుంటాం" అన్నాడు మహారాజు.

"చిత్తం!" అన్నాడు మంత్రి.

○ ○ ○

రాకుమారి తన పెదనాన్నగారి వూరినుంచి తిరిగి వస్తూ ఓ అడవిలో వున్న విచిత్రమైన లేడిని తీసుకు వచ్చిందనీ దాని ఒంటిరంగు మామూలు లేళ్ళలా కాకుండా అచ్చం బంగారం రంగుతో వున్నదనీ, శ్రీరంగపట్టణమంతా వ్యాపించింది.

తన రాజపుత్రి తీసుకు వచ్చిన బంగారు లేడిని చూ
టానికి ప్రజలు తండోపతండాలుగా రాజమందిరానికి రా
గారు.

మహారాజుగారు, మంత్రిగారు, పురజనుల వుత్సాహాన్ని చూసి ఆ బంగారపు లేడిని రాజమందిరపు ఆవరణలో వుం
వారం రోజులపాటు అందరికీ చూపించారు.

రాకుమారి ఆ తర్వాత ఆ బంగారు లేడిని ఎప్పుడూ త
దగ్గరే వుంచుకుని మురిసిపోతూ వుండేది. ఆ లేడికూడా రా
మారిని ఒక్క క్షణం కూడా విడిచి పెట్టకుండా అంటి పెట్టు
కుని రోజురోజుకు ఆమె ఆదరాభిమానాలు విశేషంగా చూ
గొంటూండేది.

ఇలా వుండగా —

ఒకనాడు కోట వుత్తరం ద్వారం సంరక్షకుల్లో ఒక
మహారాజు దగ్గరికి వచ్చి, "ప్రభూ! వున్నట్టుండి కో
వుత్తరద్వారం పైకప్పు విరిగి కొంతవరకూ క్రిందపడిం
ద్వారంమీద కప్పు క్రింద అమర్చబడిన కొన్ని ఇను
పెట్టెలతో బాటు కళ్ళకు మిరుమిట్లుగొలిపే నవరత్నాల
బంగారు కణికలూ, క్రింద పడ్డాయి. ద్వారసంరక్షకాధ్యక్షు
వారువాటిన్నిటిని భటులచేత మోయించుకుని, తమ దగ్గ
వస్తున్నారు" అని విన్నవించాడు.

ఆ సమయంలో రాకుమారి బంగారులేడితో కూడా తం
దగ్గరే వుంది.

మహారాజు ఆ భటుడి మాటలకు ఆనందాశ్చర్యాలతో తలను వూగించి "వెంటనే మంత్రిగారిని ఇక్కడికి తీసుకురా" అన్నాడు.

ఆ భటుడు వెళ్ళేసరి కా పేటికలకి కోటద్వార రక్షకభటా



ధ్యక్షుడు కొంతమంది భటులచేత కొన్ని మూటలను మోయించుకుంటూ అక్కడికి వచ్చి మహారాజుకు నమస్కరించాడు.

అప్పుడు కూడా ఓ భటుడి వెంట మంత్రికూడా అక్కడికి రావటంవల్ల ఆ భటాధ్యక్షుడు మంత్రికి కూడా నమస్కరించాడు.

మంత్రి చిరునవ్వుతో అతడ్ని చూస్తూ ఏమయ్యా మన కోటద్వారాలు రత్నాలనూ, బంగారాన్నీ కురిపించటం ప్రారంభించాయన్న మాట!" అన్నాడు

"మంత్రిగారూ! మూటలు విప్పి అవి ఏ తరహాకు చెందినవో చూడండి కోట గుమ్మం పైనుంచి క్రిందకాలాన్ని బట్టి వీటిని మా పూర్వులెవరో అక్కడ నిక్షిప్తం చేసివుంటారని భావించవలసి వస్తోంది" అన్నాడు మహారాజు

"చిత్తం! అలాగే జరిగి వుంటుంది" అని రక్షక భటాధ్యక్షుడితో ఆ మూటను విప్పమని చెప్పారు.

అతడు ఆ మూటలన్నీ విప్పగానే కళ్ళకు మిరుమిట్లు గొల్పుతూ అమూల్యమైన వివిధ రత్నాలూ, వజ్రాలూ, గోచరించాయి. కల్తీ లేని స్వచ్ఛమైన బంగారు కణికలు అగ్గి కణికల్లా ధగధగలాడుతూ కనిపించాయి

"ఆహా! ఇవి ఏకాలంనాటివో గాని. వీటికి విలువ కట్టటం అసాధ్యం ప్రభూ!" అన్నారు మంత్రి

"వెంటనే నిపుణులను పిలిపించి, వీటిని పరీక్షించమని చెప్పండి మంత్రిగారూ!" అన్నారు మహారాజు ఆ ఐశ్వర్యాన్ని చూస్తూ

మంత్రి వెంటనే ఓ భటుడ్ని నిపుణులకోసం పంపి, కోట రక్షక భటాధ్యక్షుడితో "భద్రా! ఇక మీరు వెళ్ళి వి

వేషాలు చూసుకోండి" అన్నారు.

వాళ్ళందరూ మహారాజుకూ, మంత్రికీ నమస్కరించి అక్కణ్ణుంచి బయలుదేరి వెళ్ళిపోయారు!

"మహారాజా! ఏ తరానికో చెందిన తమ పూర్వీకులు ఈ ఐశ్వర్యాన్ని ఆ కోట గుమ్మంపైన నిక్షిప్తం చేసి గుప్తనిధిగా చేసివుంటారు. తమ అవసానదశలో తమ సంతతి వారికి ఆ నిధి రహస్యం చెబుదామని, ఆ తర్వాత చెప్పే వ్యవధి కూడా లేకుండా హఠాన్మరణం చెందివుంటారు. అందువల్ల అవి ఎంతకాలం నుంచో అలాగే వుండి ఇప్పుడు మన కరంలో బయల్పడ్డాయి" అన్నాడు మంత్రి.

"ఏ తుఫానో, యుద్ధమో సంభవించినప్పుడైతే ద్వారబంధాలూ, కోట గోడలూ నగుళ్ళు వారటం సంభవిస్తాయి గాని, ఇప్పుడు పూరికే ఈ ద్వారబంధం పైకప్పు విరిగి పడటమూ, ఈ నిధి మనకు లభించటమూ ఆశ్చర్యంగా లేదూ!" అన్నాడు మహారాజా వింతగా ఆ నిధిని చూస్తూ.

"ప్రాప్తం ప్రభూ! అది వున్నప్పుడు చేతికందాలిసింది యేదైనా ఏదో విధంగా అందుతూనే వుంటుంది" అన్నాడు మంత్రి.

వాళ్ళలా మాట్లాడుకుంటూండగానే సేనాధిపతి కూడా అక్కడికివచ్చి "ప్రభూ! నేను విన్న వార్త నిజమేనన్న మాట. ఈ అమూల్య సంపద దేవరవారికి దక్కినందుకు నేనెంతగానో ఆనందిస్తున్నాను" అన్నాడు.

"ఇది ప్రజల కుపయోగపడే ఐశ్వర్యంగా నా పూర్వీకులు గుప్త ధనంగా వుంచారు. ఇప్పుడు మన హయాంలో వారికే



వుపయోగపడుతూన్నందుకు నాకు కూడా ఆనందంగా వుంది" అన్నాడు మహారాజా.

ఇంతలో___

భటుడి వెంట ఆస్థాన రత్నపరీక్షకుడు అక్కడికి వచ్చి ఆశ్చర్యంగా ఆ రత్నాలను చూస్తూనే మహారాజుకు, మహామంత్రికి, సేనాధిపతికి నమస్కరించాడు.

మంత్రి అతన్ని చూస్తూ "ఈ రత్నాలకు విలువ కట్టండి" అన్నాడు.

రత్నపరీక్షకుడు కొంతసేపు వాటినన్నిటినీ వేర్వేరుగా పరీక్షించి, ఆ తర్వాత బంగారాన్ని కూడా పరీక్షించి, ప్రభువులవైపు తిరిగాడు.

"మహారాజా! ఈ రత్నాలలో నవరత్నాలు కలిగివున్నాయి. ఇవి శ్రేష్ఠమైన జాతిరత్నాలు. మహారాజ్యాలనే కొనగల విలువ వీటికి వుంది. ఇక ఈ బంగారం కూడా మేలిమి బంగారంలో మొదటిశ్రేణికి చెందింది. ప్రస్తుతం వీటి విలువ మన రాజ్యాల్లాంటి ఐదు రాజ్యాలతో సమానం" అన్నాడు.

ఆ మాటలు వినగానే సేనాధిపతి గుటకలు మింగుతూ "ఐదురాజ్యాల విలువే! ఇది ఎంత మంచి సమయాన, మన దేశం శాంతి సుభిక్షాలలో ఓలలాడేందుకు యీ ధనం ఎంతగానో వుపయోగపడుతుంది" అన్నాడు.

మహారాజు చిన్నగా నవ్వి, "మనకు ఈ అపురూపపు అమూల్య సంపదలు లభించటానికి కారణం ఏమిటో తెలుసా మీ కెవరికైనా?"

"అదృష్టం కలిసివచ్చి ఇలా లభ్యమైంది. దీనికి ప్రత్యేక

మైన కారణం ఏమయుంటుంది ప్రభూ?" అన్నాడు సేనాధిపతి.

మంత్రి చిరునవ్వుతో "నాకు తెలుసు ప్రభూ!" అన్నాడు.

"ఏమిటో చెప్పండి చూద్దాం."

మహారాజు అలా అనగానే మంత్రి రాకుమారి వేపు చూస్తూ, "అదిగో—అదృష్టం మూర్తీభవించిన మన చిట్టి తల్లిగారు వెంట తీసుకువచ్చిన ఆ బంగారు లేడివల్లనే మనకు ఈ ఐశ్వర్యం లభించింది. ఈ శుభం ప్రారంభం మాత్రమే! ఇంకా ఎన్నెన్నో శుభ పరంపరలు మన రాజ్యానికి చేకూర్తాయన్న నమ్మకం నాకు వుంది" అన్నాడు మంత్రి.

"మంత్రిగారు మా అభిప్రాయాన్ని చక్కగా అన్వయించి చెప్పారు" అన్నాడు మహారాజు.

అనంతరం—

మహారాజు ఆజ్ఞ ప్రకారం మంత్రి భటుడ్ని పంపించి కోశాధ్యక్షుణ్ని అక్కడికి పిలిపించాడు.

ఆ వజ్ర వైఢూర్య మరకత మాణిక్య నీలగోమేధిక పుష్యరాగాలకు చెందిన అమూల్య రత్నసంపదనూ, బంగారు కణికలను, లెక్కవ్రాయించి భటులచే కోశాధ్యక్షుని వెంట పంపించాడు మంత్రి.

వాళ్ళు ఆ పనిని అలా పూర్తిచేసి కాసేపు ఏదో మాట్లాడుకుంటూండగా కొందరు భటులువచ్చి మహారాజుకు నమస్కరించి, "ప్రభూ! మనరాజ్యపు దక్షిణపు పొలిమేరల్లోని నల్లమల అడవుల్లోని గజదొంగలను మన సరిహద్దు భద్రతా దళాలు పట్టుకునివచ్చారు. ఆ దొంగలు చాలాకాలంనుండి మనం ఎన్ని విధాల ప్రయత్నించినా తప్పించుకుని తిరుగుతూ మన ప్రజల్ని రకరకాలుగా దోచుకుంటూ వచ్చారు" అన్నారు.



"ఆఁ! నల్లమల దొంగలు పట్టుబడ్డారా? అయితే, వారంతా ఎక్కడ వున్నారు?" అన్నాడు సేనాధిపతి ఆందోళనతోనూ ఆశ్చర్యంతోనూ.

"ఆ దొంగలు పట్టుబడినందుకు నువ్వెందుకంత ఆందోళన వ్యక్తం చేస్తున్నావు సేనానీ?" అన్నాడు మంత్రి చిన్నగా నవ్వుతూ.

"ఆందోళన ఆనందం ఎక్కువైనా ఏర్పడుతుంది మంత్రిగారూ! ఆ దొంగలు పట్టుబడ్డారని తెలియగానే నా శరీరంలోని అణువణువూ సంతోషంతో పరవశించిపోయింది" అన్నాడు సేనాధిపతి.

"సరే. ఇది కూడా మనకు శుభకరమైన వార్తే. ఈ బంగారులేడి మన దగ్గరికి చేరినప్పటినుండి అమోఘమైన పరిణామాలూ, శుభాలూ కలిగాయి. మంత్రిగారూ! మనం వెంటనే పరుగు వెళ్ళి ఆ దొంగలు దోచుకున్న వస్తు సంపదలను తిరిగి మన ప్రజలకు చెందే ఏర్పాటుచేసి దొంగలకు శిక్షలు విధించుదాం పదండి" అన్నాడు మహారాజు.

"చిత్తం ప్రభూ!" అన్నాడు మంత్రి.

ఆ తర్వాత మహారాజు, మంత్రి అక్కడ్నుంచి బయలుదేరారు. సేనాధిపతి కూడా వారి వెంట బయలుదేరబోతూ, బంగారులేడి తలమీద చెయ్యివేసి నిమరబోయాడు. అతనలా చెయ్యిని వుంచగానే రాకుమారి ముఖం చిట్లించుకుంది.

రాకుమారి ముఖం చిట్లించుకోవటం గమనించిన లేడి సేనాధిపతిని విదిలించి కొడుతున్నట్లు తలను గట్టిగా అటూ ఇటూ త్రిప్పింది.

# 5

శ్రీరంగపట్టణం ఏ అరిష్టాలూ లేకుండా సకలైశ్వర్య సమృద్ధంతో తులతూగుతూ ఎంతగా సత్యశీలమహారాజు పరిపాలన వల్ల కొనసాగుతోంది. గజదొంగలనుంచి స్వాధీనం చేసుకున్న అపార ధనరాసులను దేశ ప్రజలందరికి పంచిపెట్టారు. ఆ ఐశ్వర్యమంతా తమకు బంగారులేడి తమ దేశంలో ఉండటంవల్లనే కలిగిందన్న భావంతో ప్రజలంతా ఆ లేడిని ఇష్టదైవతమ పూజించినట్లు పూజించసాగారు.

నవయౌవనంతో మిసమిసలాడుతూ, జీవకళలొలికే బంగారు బొమ్మలాఉండే ఆ సుందరాంగిని చూస్తూ, అవివాహితులైన దేశదేశాల రాకుమారులు ఆ అందాల రాశిని తమ పత్నిగా పొందాలని ఉవ్విళ్ళూరసాగారు.

మహారాజా కూడా తన పుత్రికను తగిన వరుడికి ఇచ్చి వివాహం చెయ్యాలని నిశ్చయించుకున్నారు. ఒకనాడు మంత్రిని తన దగ్గరికి పిలిపించుకుని "మంత్రిగారూ! అమ్మాయికి వివాహయోగ్యమైన వయస్సు వచ్చిందికదా! మన చిరంజీవి అందచందాలకూ, గుణశీలాలకూ, మన అంతస్తుకూ తగిన మంచి సంబంధం ఏదైనా తమ దృష్టిలో ఉందేమో చెప్పండి" అన్నారు

"చిత్తం అమ్మాయిగారికి పసితనంలోనే తల్లిగారు పోయినా, తల్లీ తండ్రీ తమరే అయి పెంచారు ఒకే ఒక పుత్రిక కాబట్టి మనం అల్లుడిగారిని మన రాజ్యానికే పట్టాభిషిక్తుణ్ని చేద్దాం. అలాంటి యోగం ఏ రాజకుమారుడికుందో మనం జాగ్రత్తగా ఎంతోమంది రాకుమారులను పరిశీలించి



గాని నిర్ణయించుకోలేం. అందువల్ల కొంత కాలయాపన జరగవచ్చు" అన్నాడు మంత్రి.

"కాలయాపన జరిగినా మనం అనుకున్న గుణగణాలూ, అందచందాలూ కలిగినవాడు దొరకాలి. ఇప్పటినుంచి ప్రయత్నాలు చెయ్యండి" అన్నాడు.

వాళ్ళిద్దరూ అలా మాట్లాడుకుంటూ ఉండగా రాకుమారి బంగారులేడిని వెంటబెట్టుకుని అక్కడికి వచ్చింది.

"ఏమిటి నాన్నగారూ! ఇప్పటినుంచే ఏం ప్రయత్నాలు చెయ్యమని మంత్రిగారికి చెబుతున్నారు?!" అంది రాకుమారి అక్కడికి రాగానే చిరునవ్వుతో.

"రా తల్లి! నీ వివాహ విషయం గురించి నాన్నగారూ, నేనూ చర్చించుకుంటున్నాం" అన్నాడు మంత్రి

"నా వివాహానికి ఇప్పుడేమంత తొందర వచ్చిందని మంత్రిగారూ? ప్రస్తుతానికి ఈ సమస్యను విడిచిపెట్టి ఇంకేదైనా ఆలోచించండి" అంది రాకుమారి సిగ్గుతో తలవాల్చుకుంటూ.

ఆ సమయంలో -

ఓ భటుడు వచ్చి మహారాజుకు నమస్కరించి "ప్రభూ! ఎవరో ఒక యోగి వచ్చి అత్యవసరంగా ఏలినవారిని దర్శించాలని కోరుతున్నాడు" అని చెప్పాడు

"ఆహా! ఆ మహాత్ముడెవరోగాని మంచి సమయానికే వచ్చారు. త్వరగా వెళ్ళి ఆ పుణ్యాత్మున్ని అర్ఘ్యపాద్యాలతో స్వాగతం చెప్పి తీసుకువద్దాం పదండి ప్రభూ!" అన్నాడు మంత్రి.

"పద తల్లీ!"

అని చెప్పి మంత్రినీ, కూతుర్నీ, వెంటబెట్టుకుని మహా

రాజా ఆ భటుడి వెంట బయలుదేరాడు.

బయటికి వచ్చేసరికి అక్కడ కాషాయవస్త్రధారియైన ఓ యోగి దండకమండలాలను ధరించి, నిల్చొని ఉన్నాడు.

మహారాజు, మంత్రి, రాకుమారి, ఆ యోగికి నమస్కరించగానే అతడు కుడిచెయ్యి ఎత్తి "దీర్ఘాయురస్తు" అని దీవించాడు అందరిని.

"లోపలికి దయచేయండి స్వామీ!"

అని మహారాజు అనగానే ఆ యోగి గడ్డాన్ని, మీసాల్ని, సవరించుకుంటూ అడుగు ముందుకు వేశాడు.

మహారాజు, మంత్రి, ఆ యోగిని లోపలికి తీసుకు వచ్చి, ఓ బంగారు పీఠంమీద కూర్చోబెట్టారు.

"స్వామీ! తమరెవరు, ఏ ప్రయోజనాన్ని కోరి మా ప్రభువుల దర్శనానికి వచ్చారు!" అని అడిగాడు మంత్రి.

"మంత్రిగారూ! నేనో ముఖ్యమైన పనిమీదనే ప్రభువులను సందర్శించాలని వచ్చాను" అన్నాడు యోగి.

మహారాజు యోగి మాటలకు సంతోషిస్తూ "మీ లాంటి మహాయోగుల ఆదరాభిమానాలను సంపాదించుకోవటం సామాన్యులకు సాధ్యం కాదు. పోతే - ఇక తామూ వచ్చిన పనేమిటో సెలవిస్తే, తమ పనిని చక్కజేయటానికి సిద్ధంగా ఉన్నాను" అన్నారు.

"మహారాజా! ప్రస్తుతం మీ రాజ్యం శాంతిసుభిక్షాలతో తులతూగుతోంది. ధర్మపరాయణులైన మీరు ధర్మాన్ని నాలుగు పాదాల మీదా నడిపిస్తూ, ప్రజారంజకంగా పరిపాలన కొనసాగిస్తున్నారు. అయితే, ఇక కొలదిదినాలలో మీకు భరించరాని కష్టపరంపరలు ఊహించరాని విధంగా రాబోతున్నాయి.



నేను మీ పరిపాలనలో ఓ పౌరుడిని కాకపోయినా, మీరు పాలించే దేశంలోని ఓ అడవిలో తపస్సు చేసుకునే మునిని కాబట్టి నా ప్రభువులు, నా దేశానికి ఏర్పడబోయే ప్రమాదాన్ని వివరించటానికి బయలుదేరాను. ఇది సభలో పదిమంది ఎదుట మీకు చెప్పాల్సిన విషయం కాదు కాబట్టి, ఏకాంతంగానే తమకు వివరించాలన్న ఉద్దేశ్యంతోనే రాజమందిరంలోకి వచ్చాను నేను. సింహద్వారం దగ్గరా, ఈ మందిరం ద్వారం దగ్గరా, మీ భటులు చూపించిన ప్రత్యేక మర్యాదల్ని బట్టి నాలాంటి సాధువులు, సత్పురుషులు, తమ దర్శనానికి వచ్చినప్పుడు ఎలా వారిని గౌరవించాలో బాగా కట్టుదిట్టం చేసిన విధానాన్నిబట్టి మీ ధార్మికగుణాన్ని ఊహించాను అంతకు ముందు నేను విన్నదానికీ, ఇప్పుడు కళ్లారా చూసినదానికీ, సరిగ్గా సరిపోయింది. నా శక్తులన్నీ ధారబోసి, మీకూ, మన దేశానికీ రాబోయే అనర్థపరంపరలను తొలగించాలని నేను చేసుకున్న నిర్ణయం సరైనదేనని ఇప్పుడర్థమైంది" అన్నాడు.

ఆ యోగి అలా చెప్పగానే—

మహారాజు ముఖం వెలవెలబోయింది.

మంత్రి నిశ్చేష్టుడయ్యాడు!

రాకుమారి తీవ్రమైన ఆలోచనలో మునిగిపోయింది.

బంగారులేడి తన కళ్ళను తీక్షణంగా యోగివేపే ప్రసరింపజేసి, చెవులు రిక్కించుకుని అతడు చెబుతున్న మాటలనే వింటోంది. కొన్ని క్షణాల దాకా ఆ మందిరాంతర్భాగంలో నిశ్శబ్దత వ్యాపించింది.

అనంతరం—

మహారాజు యోగివేపు భక్తి పూర్వకములైన దృష్టులను

ప్రవేశింపజేస్తూ, "స్వామీ! మాకు రాబోయే కష్టాలేమిటో, వాటిని మీరు ఏ విధంగా తొలగించటానికి నిర్ణయించుకున్నారు?" అని అడిగాడు.

మంత్రికూడా ఆ యోగిని అలాగే ప్రశ్నించాలనుకున్నాడుగాని, అంతలోనే మహారాజే ఆ మాట అడగడంతో ఆ యోగి అందుకు ఏం సమాధానం చెబుతాడోనని ఆత్రుతతో ఆ మాటలు వినటానికి కుతూహలంతో నిరీక్షించసాగాడు.

"మహారాజా! మీరూ, ఆమాత్యులుగారూ, మంత్రిగారూ, అన్నీ తెలిసినవారు. అరిష్టాలను తెలుసుకోవటం, వాటిని గురించి ఆందోళనతో మనస్సులను పాడుచేసుకోవటం మంచిదికాదు. శుభాలనైతే తెలుసుకుని ఉత్సాహంగా వుండటం సహజంగాని, అశుభాలను తెలుసుకోవటంవల్ల నిరుత్సాహమూ, నిర్వీర్యతా ఏర్పడుతాయి. నేనెలాగూ మీకు అరిష్టాలను తొలగించటానికే వచ్చాను కాబట్టి, వాటిని తొలగించివేసే ప్రయత్నాన్ని ఈ దినం నుంచే ప్రారంభిస్తాను. తిరిగి నేను వెళ్ళబోయే ముందు రాబోయే అరిష్టాలేమిటో, నేను వాటికి చేసిన విరుగుడు ఏమిటో వివరంగా చెబుతాను. ప్రస్తుతానికి అంతటితో సంతృప్తిపడండి. ఇక నేను ఆ అరిష్ట నివారణకు చేయబోయే విధానానికి సహకరించండి" అన్నాడు యోగి.

ఆ యోగి చెప్పిన మాటల్లో సమంజసం వున్నదని మహారాజా, మంత్రి భావించారు. రాకుమారి అతడి మాటల్లోని భావాన్ని ఆలోచిస్తోంది.

"అలాగే స్వామీ! మీరు చేయబోయే ఆ విధానం ఏమిటో



తెలియచెయ్యండి. ఏ సహకారం కావాలో చెప్పండి" అన్నాడు మహారాజా.

"నేను సర్వారిష్టసంహారి" అనే యజ్ఞాన్ని చేయటానికి సంకల్పించుకున్నాను. ఆ యాగం మూడు దినాలలో పూర్తి అవుతుంది. అయితే, యాగానికి కావాల్సిన వస్తుసంభారాలన్నిటినీ ఓ గదిలో చేర్పించి, నన్ను అందులో వుంచి, బైట కట్టుదిట్టమైన కాపలా పెట్టాలి. నేను ఈ మూడు దినాలూ దీక్షలో వుండగా ఎవరూ లోపలికి రాకూడదు. ఆఖరికి మీరు కూడా రాకూడదు. ఈ విధంగా అత్యంత నియమ నిష్ఠలతో నేను యాగాన్ని పూర్తిచేసి, వెలువడే యాగఫలంతో బాటు, నా తపశ్శక్తిని కూడా మీకు ధారపోసి, రాబోవు అనర్థ పరంపరలేమిటో అవి నా శక్తులద్వారా ఏ విధంగా సమసిపోతాయో వివరంగా చెప్పి మిమ్మల్నందరినీ మనస్ఫూర్తిగా దీవించి వెళ్ళిపోతాను" అన్నాడు యోగి.

"మహాభాగ్యం. మీరు కోరినట్లు అన్ని ఏర్పాట్లు చేయిస్తాను" అన్నాడు మహారాజా.

"శుభం భూయాత్" అన్నాడు యోగి.

## 6

వెంటనే మహారాజా యోగి చెప్పిన వస్తు సంభారాలన్నిటినీ తెచ్చి సమకూర్చి ఓ గదిని యోగికి కేటాయించగా అతడు అందులో ప్రవేశించి తలుపులు మూసుకున్నాడు.

మహారాజా ఆ గది బయట సాహసులైన పదుగురు భటుల్ని కాపలా వుంచి, ఆ మూడురోజులూ ఏమరుపాటు లేకుండా కాపలా కాయాలని ఆ భటుల్ని కఠినంగా హెచ్చరించాడు.

తానూ, మంత్రి ఆ మూడు రోజులూ ఆ గది దరిదాపులకు కూడా వెళ్ళకుండా వుండిపోయారు.

మూడవరోజు రాత్రి మంత్రితోనూ, తన పుత్రికతోనూ, కాసేపు మాట్లాడి తన శయన మందిరానికి వెళ్ళాడు.

మర్నాటి ఉదయానికల్లా యోగివర్యుడు తన యాగ ఫలితాన్నీ, తపశ్శక్తినీ ధారపోసి వాటిని తన దేశ క్షేమంకోసం వినియోగించే విధానాన్ని గురించి ఆలోచించుకుంటూ అలాగే నిద్రపోయాడు. తెల్లవారింది.

మహారాజు కాలకృత్యాలు తీర్చుకుని, అలవాటు ప్రకారం పుత్రిక మందిరానికి వెళ్ళాడు

అక్కడ దాసీలు. చెలికత్తెలు ఆందోళనగా అటూ ఇటూ తిరుగుతూ వుండటం చూసి, మహారాజు తన పుత్రిక శయన మందిరం దగ్గరికి వెళ్ళాడు.

వెంటనే—

ఓ దాసి పరుగెత్తుకుంటూ మహారాజు దగ్గరికి వచ్చి నమస్కరిస్తూ, "ప్రభూ! యువరాణిగారు పాన్పు మీద కనిపించటం లేదు. అలా తోటలోకి షికారు వెళ్ళారేమోనని ఇప్పటి తోటంతా వెతికివచ్చాం కాని, ఎక్కడా వారు కనిపించలేదు. తమ దర్శనానికి వచ్చారేమోనని ఆలోచిస్తూ కూర్చున్నాం. ఇంతలో తమరే వచ్చారు. యువరాణిగారు తమ దగ్గరికి రాలేదా ప్రభూ!" అంది.

"యువరాణిగారు కనిపించటం లేదా!" ఆందోళనగా ప్రశ్నించాడు మహారాజు.

"చిత్తం" అంది ఆ యువతి

మహారాజు వెంటనే మరో దాసిని పిలిచి, "నువ్వు వెళ్ళి



మహామంత్రిగారిని తక్షణం మా దగ్గరికి తీసుకురా" అని ఆజ్ఞాపించాడు.

ఆ దాసి పరుగెత్తుకుంటూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

మహారాజు మొదటి దాసిని ఇలా ప్రశ్నించటం ప్రారంభించాడు—

"అమ్మాయిని రాత్రి ఎప్పుడు చూశారు మీరంతా?"

"రాత్రి చాలా సేపటిదాకా సంగీత కాలక్షేపం చేశాం ప్రభూ! మర్నాటి ఉదయం నాన్నగారితో కలిసి యోగిని దర్శించాలని చెప్పారు అమ్మాయిగారు. అందువల్ల ఉషోదయం కాకముందే స్నానానికి ఏర్పాట్లుచేసి. తమ్ము నిద్ర లేపమని చెప్పి తమ పెంపుడు బంగారు లేడిని పాన్పు ప్రక్కనే పడుకోబెట్టుకుని నిద్రించారు.

మేము చీకటి వుండగానే నిద్ర లేచి, యువరాణిగారికి స్నానానికి పన్నీటి జలకం సిద్ధంచేసి ఆమె పాన్పు దగ్గరికి వెళ్ళాం. పాన్పు మీద యువరాణిగారు లేరు ఆమె బంగారు లేడి కూడా లేదు. ఒకవేళ మాకంటె ముందుగా లేచి షికారు వెళ్ళారేమోనని వెతికాం. భవనంలో గాని, తోటలో గాని, యువరాణిగారి జాడగాని, బంగారులేడి జాడగాని కనిపించలేదు ప్రభూ! ఉన్నట్లుండి అమ్మాయిగారు ఎక్కడికి వెళ్ళి వుంటారో వూహించటానికే వీలుకాకుండా వుంది" అంది ఆ యువతి భయకంపిత స్వరంతో.

వాళ్ళు యువరాణిని గురించి అలా మాట్లాడుకుంటూండగానే దాసి వెంట మంత్రి ఆందోళనగా అక్కడికి వచ్చాడు.

అతడు రాగానే మహారాజుకు నమస్కరిస్తూ "ఏమిటి ప్రభూ, ఈ విపరీతం! అమ్మాయిగారు కనిపించడం లేదని దాసీలు చెబుతున్నారు" అని అడిగాడు.

మహారాజు ఖేదమవమ్కార్తై "అవును మంత్రిగారూ! ఇప్పుడే నాకీ సంగతి తెలిసింది. వెంటనే మీ కోసం కబురు పంపించాను. అమ్మాయి ఎక్కడికి వెళ్ళిందో ఏమీ అర్థం కావటంలేదు" అన్నాడు.

ఎక్కడికైనా వెళ్ళిందో, ఎవరిచేతనైనా కొనిపోబడిందో ఏమీ అర్థంకాక మంత్రి, "అసలు ఏం జరిగిందో వివరంగా కనుక్కోండి ప్రభూ!" అన్నారు.

"కనుక్కున్నాను. కాని, అమ్మాయి కనిపించకపోవటానికి కారణ మేమిటో బోధపడటంలేదు" అని మహారాజు తాను ప్రశ్నించిన యువతికేసి తిరిగి "నాతో చెప్పిందంతా మంత్రిగారికి కూడా చెప్పు" అన్నాడు.

ఆ యువతి అంతకుముందురాత్రి జరిగిందంతా మంత్రికి వివరంగా చెప్పింది.

మంత్రి కొన్ని క్షణాలు ఏదో తీవ్రంగా ఆలోచించి ఇలా అన్నారు—

"ప్రభూ! యోగీంద్రులు తమ యాగాన్ని పూర్తి చేసి, ఈ రోజు ఉదయాన్నే మనకు దర్శనం ఇస్తామన్నారు కదా! కనక యోగీంద్రుల దగ్గరికి వెళదాం పదండి ప్రభూ!" అన్నారు మంత్రి ఆలోచిస్తూ.

అప్పట్లో అదే ఉచితమనిపించింది మహారాజుకు. వెంటనే మంత్రితో కలిసి అక్కడినుంచి బయలుదేరాడు.

## 7

ఆ గదిముందు మూడురోజులనుంచి వంతులప్రకారం కావలా కాస్తోన్న రక్షకభటులు నిద్రలేక నీరసంగా వున్నట్లు అగుపిస్తున్నారు



ఒక భటుడు ఎదురుగా చూపులుసారించి "ఒరేయ్, మహారాజుగారు, మంత్రిగారు వస్తున్నారు. హుషారుగా కావలా కాయండి" అని హెచ్చరించటంతో తాను కూడా లేని హుషారును తెచ్చుకున్నాడు.

ఇంతలో—

మహారాజూ, మంత్రి అక్కడికి రాగానే భటులంతా వాళ్ళకు నమస్కరించారు

కావలా జాగ్రత్తగా కాస్తున్నారు కదూ!" అని ప్రశ్నించాడు మహారాజు ఆ భటుల్ని చూస్తూ.

"చిత్తం. ఈ మూడు రోజులనుంచి లోపలి పురుగు బయటికిగాని, బయటిపురుగు లోపలికిగాని వెళ్ళకుండా ఎంతో జాగ్రత్తగా కావలా కాస్తున్నాం ప్రభూ!" అన్నాడు ఓ భటుడు.

"పురుగుల సంగతి అలా వుంచు గాని, లోపలినుంచి యోగీంద్రులవారు తలుపు తట్టడంగాని, బయటికి రావటం గాని చేశారా?" అని అడిగాడు మంత్రి.

మంత్రి అలా విసుగు చెందటానికి కారణమేమైవుంటుందా అని ఆలోచిస్తూనేవున్నట్లు తల వూగిస్తూ ఓ భటుడు "చిత్తం. అలాంటిదేదీ జరగలేదు. ఆ యోగిని మేమింతవరకూ చూడలేదు. మహారాజుగారి ఆజ్ఞ ప్రకారం ఈ గదిముందు కావలా కాస్తున్నాం" అన్నాడు.

"ఇప్పుడేం చేదాం ప్రభూ! యోగీంద్రులు ఇంకా తమ యోగ కార్యక్రమాన్ని ముగించినట్లు లేదే!" అన్నాడు మంత్రి.

సూర్యోదయానికల్లా యాగం పూర్తవుతుందని చెప్పారే! ఇప్పుడు సూర్యుడు ఉదయించాడుగా?" అన్నాడు మహారాజు.

"అవును. ఇంకొంచెంసేపు ఇక్కడే నిరీక్షించుదాం.

యోగీంద్రులు మనకు దర్శనం ఇచ్చేలోగా రాకుమారికొరకు కోట నలువైపుల వెతికిరమ్మని భటుల్ని పంపుదామంటారా!" అన్నాడు మంత్రి

"కోట వెలుపలికి ఎందుకు వెళుతుంది? ఈ సందిగ్ధావస్థ నుంచి మనల్ని ఆ మునీంద్రుడే కాపాడాలి" అన్నాడు మహారాజా విచారం వ్యక్తంచేస్తోన్న కంఠస్వరంతో.

వాళ్ళు అలా మాట్లాడుకుంటూండగానే సూర్యుడు క్రమక్రమంగా ఆకాశంలో ప్రకాశవంతంగా విజృంభించడం ప్రారంభించాడు.

ఎండ రాజమందిరాల మీద చిక్కగా అలుముకుంది. ఎండతోపాటు మహారాజా ముఖం కూడా ఆందోళనతో, దుఃఖంతో ఎర్రబడసాగింది.

"మంత్రిగారూ! ఇక కాలయాపన నేను సహించలేకుండా వున్నాను. యోగీంద్రులు తలుపులు తీయకుండా ఇంతసేపు ఎందుకు వున్నారో నాకేమీ అర్థం కావటం లేదు. పోనీ, మనమే తలుపులు తీస్తే!" అన్నాడు మహారాజా.

మహారాజా మాటలకు మంత్రి కంగారు పడ్డాడు. ఒక వేళ తాము తొందరపడి అలా తలుపు తీయటంవల్ల ఏ అనర్థం వాటిల్లుతుందో!....ఏ అనర్థం వాటిల్లినా అది రాజకుటుంబానికీ, దేశానికీ అనర్థం!

మంత్రి ఆ విధంగా పరిపరివిధాల ఆలోచనలతో సతమతమౌతూ మహారాజా అడిగిన దానికి సరైన సమాధానం చెప్పలేకపోయాడు

"మాట్లాడరేం మంత్రిగారూ, మా ఒక్కగానొక్క పుత్రిక అంతర్ధానం కావటమూ, యోగి ఇంకా తలుపులు తీయక పోవటం, మాకు చాలా ఆందోళన కలిగిస్తోంది. ఒకవేళ



యాగం చెడిపోయి యాగఫలితం దక్కకుండా పోయినా పర్వాలేదు - ఆ యోగి కోపించి, ఏదైనా శాపం ఇచ్చినా పర్వాలేదు. నా పుత్రిక మాయమైపోయినందువల్ల ఏర్పడిన దుఃఖం కంటే ఆ బాధలు ఏమీ గొప్పవి కావు. అనర్థాలు జరగవని చెప్పిన మునివాక్కు పొల్లుపోయి ఎలాగూ అనర్థం జరిగిందికదా? నేను ఆజ్ఞాపిస్తున్నాను. తలుపులు తీయండి" అన్నాడు మహారాజా.

పుత్రిక అంతర్ధానం కావటం వల్ల ఏర్పడిన మనోవ్యాకులతతో మహారాజుగారు అలా అంటున్నారనీ, అలా అనటంలో దోషమేమీలేదనీ, అర్థం చేసుకున్నాడు మంత్రి

ఇక— రక్షకభటుల్ని చూస్తూ "ఇక గస్తీ తిరగటం చాలుగాని తలుపులు తీయండి" అన్నాడు.

వెంటనే ఓ భటుడు చేతిలోని కత్తిని క్రిందపెట్టి, తలుపు తీయబోయాడు.

కానీ, అది తెరుచుకోకపోవటంతో మరింతగట్టిగా నెట్టాడు. ఫలితం లేకపోయింది.

"లోపల గడియ వేశారు ప్రభూ!" అన్నాడు ఆ భటుడు వెనక్కి తిరిగి మహారాజును చూస్తూ.

"బయట ఇంత కట్టుదిట్టమైన కాపలా పెట్టినప్పుడు ఆ యోగికి లోపల గడియ వేసుకోవాలిసిన అవసరం ఏమొచ్చింది. మాయగా వుందే" అన్నాడు మహారాజా.

"తలుపులు బద్దలు కొట్టండి"

మహామంత్రి భటులకు ఆజ్ఞయిచ్చాడు.

వెంటనే ఇద్దరు రాజభటులు ఓ ఇనుప గుదియను మోసుకొచ్చి, తలుపులకేసి బలంగా కొట్టారు.

ఆ ప్రేటుకు గడియకు అనుబంధంగా వున్న కొక్కెం వదలడంతో తలుపులు కాస్త వూగాయి.

ఆ భటులు అలాగే నిర్విరామంగా ఆ దానవ గుడియతో తలుపుల మీద గట్టిగా మోదటం కొనసాగించారు.

అలా మోదగా మోదగా కొంతసేపటికి గడియ విరిగి తలుపులు బార్లా తెరుచుకున్నాయి.

వెంటనే—

మంత్రి గబ గబా లోపలికి వెళ్ళి "ఆ! యోగి లేడు ఏదో మోసం జరిగింది ప్రభూ!" అన్నాడు ఆందోళనతో.

ఆ మాటలకు ఆదరిపడుతూ మహారాజా కూడా గబ గబా లోపలికి నడిచాడు.

గది మధ్య యేవేవో ముగ్గులు పెట్టబడి, రంగులు పోయబడి వున్నాయి. అక్కడక్కడ నిమ్మకాయలు కోసి. వాటి మీద కుంకుమ చల్లబడి వుంది.

అది ఏదో క్షుద్రపూజా విధానాన్ని సూచించే వాతావరణంగా కనిపించిందిగాని, పవిత్రమైన యాగం చేసిన లక్షణాలు లేవు.

మంత్రి కంగారుగా ఆ గది నలుమూలలా కలియ చూస్తూనే వున్నాడు ఇంకా.

మహారాజా కూడా గదినంతా ఓమారు పరిశీలించి "ఆ యోగి నిజంగా మనల్ని మోసం చేశాడు మంత్రి గారూ!" అన్నాడు

"అసలు వాడు యోగి అవునో కాదో ఇప్పుడు అనుమానంగ వుంది ప్రభూ" యోగివేషం వేసుకుని వచ్చిన ఏ మాంత్రికుడో అయి వుంటాడేమోనని అనుమానంగా వుంది" అన్నాడు మంత్రి.



"ఈ గదిలో జరిపించిన దృశ్యాలను బట్టి మనం ఇప్పుడు అలాగే అనుకోవాలనిపిస్తోంది. అయితే ఆ దుర్మార్గుడే మా అమ్మాయిని ఏదైనా కీడు కలిగించటానికి మాయంచేసి తీసి కెళ్ళి వుంటాడంటావా?" మహారాజా ఆందోళన అతిశయిస్తున్న దుఃఖస్వరంతో అన్నాడు

"నాకూ అలాగే అనిపిస్తోంది ప్రభూ! అమ్మాయి గారు మాయం కావటానికి, యోగి రూపంలో వచ్చి మనల్ని మోసగించిన దుర్మార్గుడు మాయం కావటానికీ, పరస్పర సంబంధాలు వున్నాయి అయితే దీనిగ్గురించి కూడా కనిపించక పోవటానికి కారణమేమై వుంటుందంటారూ ఆ లేడితో మాంత్రికుడికి అవసరం ఏమొచ్చిందంటారు?" అన్నాడు మంత్రి.

"ఏమో! ఆ పాపాత్ముడు మన అమ్మాయికి ఆ లేడిగారు లేకి ఆరో ప్రాణమని తెలుసుకుని, అమ్మాయితో పాటు దానిని కూడా మాయం చేసుకుని పోయివుండవచ్చు. యోగి రూపంలో వచ్చిన దుర్మార్గుడెవరో, వాడెక్కడ వుంటాడో ముందు తెలుసుకోవాలంటే. మనం ఏం చెయ్యాలో ఆలోచించండి" అన్నాడు మహారాజా.

"చిత్తం. ఇక్కడ వుండి మనం చేయగలిగిందేమీ లేదు. బయటికి వెళదాం పదండి. రాత్రో ఆలోచన చేయాలిసింది ఆ ప్రకారం. అమ్మాయి గారి జాడ మనకు తెలియటమో, లేక ఆమె మన దగ్గరికి రావటమో జరగొచ్చు" అన్నాడు మంత్రి.

మహారాజా నీరసంగా ఆ గదిలోంచి బయటికి వచ్చాడు, మంత్రి కూడా తను మహారాజుకు చెప్పాలనుకున్న మాటల్ని గురించి మథనం చేసుకుంటూ, బయటికి వచ్చాడు.

# 8

ఆ నగరంలోని నాలుగు వీధులూ కలిసే ఓ మార్గం దగ్గర ఓ భటుడు ఏనుగు మీద కూర్చుని, గట్టిగా డప్పు మోగిస్తున్నాడు.

ఆ డప్పు శబ్దం విని ఆ వీధుల్లోని జనమంతా గుంపులు గుంపులుగా బయటికి రాసాగారు.

ఆ ఏనుగు మీది భటుడు జనమంతా అక్కడ పోగు పడటం గమనించి, డప్పు మోగించటం చాలించి, గొంతెత్తి గట్టిగా ఇలా చెప్పసాగాడు.

"ఓహో! పౌరులారా! మూడు రోజుల క్రిందట ఓ మాయావి యోగి వేషంలో మహారాజుగారి మందిరానికి వచ్చి, మహారాజుగారిని మోసం చేసి తాను యజ్ఞం చేసి దేశానికి శ్రేయస్సు కలిగిస్తానని చెప్పి, రహస్యంగా ఏదో తాంత్రిక ప్రక్రియ జరిపించి, మన రాకుమార్తెను మాయం చేసుకుని వెళ్ళాడు. ఆ దుర్మార్గుడెక్కడున్నాడో ఆచూకీ తెలుసుకుని వచ్చి, మహారాజుగారికి తెలియజేసినా, లేక అమ్మాయిగారిని సురక్షితంగా తీసుకుని వచ్చి అప్పగించినా, అట్టివారికి సగం రాజ్యాన్ని ధారపోస్తారని మంత్రిగారు చెప్పమన్నారహో...."

అది చెప్పి ఆ భటుడు ఏనుగును అక్కడినుంచి నడిపించుకుంటూ ఇంకో వీధి గుండా వెళ్ళిపోయాడు.

అక్కడ గుమిగూడినవారంతా రాకుమారి మాయం కావటం గురించి రకరకాలుగా చెప్పుకోసాగారు.

నగరంలోనే కాకుండా, చుట్టు పక్కల గ్రామాలలోనూ, ఇంకా దేశం నలుమూలలా అలాంటి చాటింపే వేయించటం



వల్ల ఆ వార్త శ్రీరంగపుర రాజ్యమంతా వ్యాపించిపోయింది.

రాకుమార్తె అన్వేషణకు శ్రీరంగపుర రాజ్యంలోని కొంత మంది ధైర్యవంతులూ, సాహసవంతులూ బయలుదేరారు!

○ ○ ○

"గంభీరా! మంత్రి వేయించిన చాటింపు విన్నావు కదా! ఇంతకాలంనుంచి ఏదో రూపంగా మహారాజును ఒప్పించి రాకుమార్తెను నీ కిచ్చి వివాహం జరిపించి రాజ్యాన్ని నీకు దక్కించాలని ప్రయత్నిస్తున్నాముగాని, ఇప్పుడు ఏ దౌర్భాగ్యుడైనా రాకుమారి ఆచూకీ తెలుసుకునివచ్చి మహారాజుకు చెబితే, అర్ధరాజ్యం పోతుంది. ఇప్పుడేం చేద్దామంటావు?"

సేనాధిపతి తన మందిరంలో — కుమారుడి ఎదురుగా అటూ ఇటూ పచార్లు చేస్తూ అంగలార్చాడు.

"పోనివ్వండి నాన్నగారూ! ఆ సగం రాజ్యంతో బాటు రాకుమార్తె నాకు భార్య అయ్యేట్టు చూడండి చాలు. తక్కిన సగం రాజ్యాన్ని సంపాదించుకునే సంగతి తర్వాత ఆలోచిద్దాం" అన్నాడు గంభీరుడు.

"ఇప్పుడు ఆ ఆశ కూడా సన్నగిల్లిపోయిందిరా బాబూ! రాకుమార్తెకు మనమన్నా, మన చేష్టలన్నా గిట్టకుండా వచ్చాయి. మహారాజు కూడా అస్తమానం ఆ మంత్రినే తన దగ్గరికి రప్పించుకుని మంతనాలు సాగిస్తుంటాడు. తీరా నోరు తెరచి అడిగినా అవమానానికి గురికావలసి వస్తుందేమోనని జంకుతున్నాను" అన్నాడు సేనాధిపతి.

ఆ మాటలకు గంభీరుడు మండిపడ్డాడు.

"మరి, అలాంటప్పుడు చిన్నప్పటినుంచి నాకు రాకుమార్తెనే భార్యగా చేస్తానని ఎందుకు చెప్పారు నాన్నగారూ! మీ

మాటల్ని నమ్ముకుని ఎంతో ఆశతో అదృష్టంకోసం ఎదురు చూశావే!" అన్నాడు గంభీరుడు

"మనం సమయానుకూలంగా ప్రవర్తించటం నేర్చుకోవాలిరా నాయనా! ఇప్పుడు ఆ సంగతులన్నీ విడిచిపెట్టి నేను చెప్పినట్లు చెయ్యి."

"ఏమిటో అది చెప్పండి త్వరగా!"

"ఇప్పటికే దేశంలోని సాహసవంతులైన యువకులు రాకుమారి అన్వేషణకు బయలుదేరి ఉంటారు. నువ్వు కూడా బయలుదేరాలి."

"ఎక్కడికి?"

"రాకుమార్తెను వెతకటానికి."

"అయ్యో, పిచ్చివాణ్ణి! రాకుమారి అన్వేషణకు నేను బయలుదేరాలా? లేక, నా అన్వేషణకు ఈ దేశంలోని వారంతా బయలుదేరాలా!" అంటూ బిగ్గరగా నవ్వాడు గంభీరుడు.

అతడి మాటలు సేనాధిపతికి అయోమయం కలిగించాయి. ఒకవేళ రాకుమార్తె దక్కకుండా పోవటంవల్ల తన కుమారుడికి పిచ్చి ఏమైనా ఎక్కిందేమోనని కూడా భావించాడు అతడు.

"నీ మాటలు నాకు అర్థం కావటంలేదు గంభీరా! నీ అన్వేషణకు దేశంలోని వారంతా బయలుదేరటమేమిటి బాబూ?" అన్నాడు సేనాధిపతి.

"రాకుమారి అన్వేషణకు బయలుదేరటమంటే ఒక విధంగా రాకుమారిని అపహరించుకుపోయినవాడిని అన్వేషించటంకోసం బయలుదేరి వెళ్ళటమేగా?"

"ఒకవిధంగా అంతేరా!"



"అలాంటప్పుడు వారంతా నన్ను అన్వేషించటానికి బయలుదేరాలి అనటంలో పొరపాటేముంది!" అన్నాడు గంభీరుడు.

"అబ్బా! నీ వొంకరటింకర మాటలు నాకేం అర్థమై చావటంలేదు గాని, వివరంగా చెప్పరా నాయనా! రాకుమారిని అపహరించుకుపోయినవాడిని అన్వేషించటంకోసం బయలుదేరటం అంటే, నిన్ను అన్వేషించటంకోసం బయలుదేరటమని ఎలా అర్థం చెప్పుకోవాలి?"

"ఆ అపహరించుకుపోయినవాడిని నేనే కాబట్టి!" అని గది అంతా మారుమోగేట్లు మరోమారు బిగ్గరగా నవ్వాడు గంభీరుడు.

ఆ మాటలు సేనాధిపతికి దిగ్భ్రాంతిని, పెద్ద అవమానాన్ని కలిగించాయి. కొన్ని క్షణాలపాటు అతడి నోటినుంచి మాట పెగలక అలాగే చూస్తూండిపోయాడు.

"ఏమిటి నాన్నా? నా మాటలమీద నమ్మకం లేదా?" అన్నాడు గంభీరుడు.

"నువ్వు తమాషాకి అంటున్నావేమో అనుకుంటున్నా మరి బాబూ! నిజంగా అంత ప్రయోజకుడివై ఇంత ఘనకార్యాన్ని సాధించినమంటే. ఇక నిన్ను గురించిన ఆలోచన నాకెందుకు? నిశ్చింతగా గుండెమీద చెయ్యి వేసుకుని నిద్రపోనూ!" అన్నాడు సేనాధిపతి.

"తమాషాకి అనటంలేదు నిజం నేనే అలా మారువేషం వేసుకుని వెళ్ళి మహారాజునూ, మంత్రినీ వంచించాను. రాకుమార్తెను ఒక రహస్య ప్రదేశంలో దాచాను" అన్నాడు గంభీరుడు

"అసలు ఏం జరిగిందో, ఎలా జరిగిందో వివరంగా

చెప్పగా నా తండ్రీ! ఈ సంగతి వింటూంటే, నా మనస్సు ఆనందంతో పొంగిపోతోంది. ఇక అర్ధరాజ్యం మాత్రమే ఏమిటి! ఈ రాజ్యమంతా మనదే. నేను మొదట్నుంచి నిన్ను మహారాజును చెయ్యాలనే కలలు కంటున్నాను. అందుకే రహస్యంగా అనుచరులను తోడుచేసి శ్రీరంగ పట్టణం శివార్లలో వుండి దొంగతనాలూ, దోపిడీలూ చేయించాను. అలా కూడబెట్టిన ధనాన్ని ఆ అడవుల్లోనే ఓ కొండగుహలో దాచి వుంచాను. మొన్నటిదినం ఆ దొంగ గ్యాంగు రాజభటులకు పట్టుబడటమే కాకుండా, ఆ నిధి రహస్యం కూడా మహారాజుకు చెప్పటంతో ఆ మంత్రిగాడు భటుల్ని పంపించి ఆ ధనాన్నంతటినీ ఖజానాకు చేర్పించి ఆ తర్వాత ప్రజలకు పంచిపెట్టి, మనకు చిప్ప మిగిల్చాడు. ఎలాగో మన అనుచరుల్లో ఒక్కడైనా చెప్పటానికి వీలు లేకుండా నేను వాళ్ళ దగ్గరికి ఎక్కడికి ఎప్పుడు వెళ్ళినా ముసుగులోనే వెళతాను కాబట్టి, తెలుసుకోవటానికి అవకాశం లేకుండా పోయాను. లేకపోతే, ఈ పాటికి మనమిద్దరం చెర సాలలో చిక్కుపడి వుండేవాళ్ళం. ఇప్పుడు నువ్వు నిజంగా ఈ పని సాధించి వుంటే, నేను కన్న కలలు నిజమైనట్టే! చెప్పునాయనా! నువ్వు ఆ రాజునూ, మంత్రినీ ఎలా మోస గించావో చెప్పు" అని అత్యంత కుతూహలంతో అడిగాడు సేనాధిపతి కుమారుణ్ణి చూస్తూ.

గంభీరుడు తండ్రిని చూస్తూ, "నాన్నా! రాకుమారి మన మంచే అవహేళించటంతో రావటం సహించలేని నేను ఎలా గైనా ఆ అందాలరాశిని పొందటానికి నిశ్చయించుకుని ఎన్నో విధాల ఆలోచించాను. ఆలోచించగా, ఆలోచించగా చివరకు



ఓ ఉపాయం తట్టింది. దానిని ఆచరణలో పెడితే, ఎలా వుంటుందా అని కాసేపు ఆలోచించాను. ధైర్య సాహసాలు లేనివాడు ఏ పనీ చెయ్యలేడని నిశ్చయించుకున్నాను. వెంటనే కాషాయవస్త్రాలు ధరించి, గడ్డంమీసాలు తగిలించుకుని జడలు కట్టుగా శిరోజాలను ముడులు చుట్టుకుని. ముఖంలో అక్కడక్కడ మార్పుచేసుకుని వెళ్ళి, మహారాజునూ, మంత్రినీ కలుసుకున్నాను." అని గంభీరుడు తాను యోగి వేషంతో రాజమందిరంలో ప్రవేశించినప్పటినుంచి రాగం కలపెట్టి తెరంతో ఓ గదిలో ప్రవేశించటందాకా చెప్పి "ఆ తర్వాత జరిగింది అత్యంత ఆశ్చర్యకరమైన విషయం" అని మళ్ళీ ఇలా చెప్పటం ప్రారంభించాడు.

"ఆ వెర్రి రాజూ, వెర్రి మంత్రీ నిజమైన యోగినే అను కుని, నాకు ఓ ప్రత్యేకమైన గదిని ఏర్పాటుచేసి, నేను ఏవో కొన్ని సామగ్రులను చెప్పగా వాటినన్నిటినీ తెప్పించి నాకు అందజేశారు. నేను గదిలోకి వెళ్ళి తలుపులు గడియ వేసు కున్నాను.

ఆ దినమంతా ఆ గదిలో గడిపి మర్నాడు తలుపు తీశాను. ద్వారం దగ్గర రాజభటులు కావలా కాస్తూ కనిపించారు. వాళ్ళు నేను తలుపులు తీయగానే 'ఏం కావాలి స్వామీ!' అని అడిగారు.

"నేను స్వామిని కాను, యోగినీ కాను. వెర్రి బ్రాహ్మణుల్లారా! మీ సేనాధిపతిగారి కుమారుణ్ణి" అన్నాను.

ఆ భటులు ఆశ్చర్యంతో ఒకరి మొహం ఒకరు చూసు కుని, కాసేపటికి నా దగ్గరికి వచ్చి "మీరు చెప్పేది నిజమేనా బాబూ! మీరు మా గంభీరసింహ దొరగారేనా?" అన్నారు.

"అఘోరయ్యా! నన్ను నమ్మకపోతే ఇలా వచ్చి చూడండి" అని గడ్డమూ మీసాలూ తీసివేశాను.

వాళ్ళు నాకు నమస్కరిస్తూ "బాబూ! ఇదేమిటి! ఇలా యోగి వేషంలో వచ్చారేమిటి? మీ రెవరో తెలిస్తే ఎంత అపాయం ఎదురౌతుందో ఆలోచించారా?" అన్నారు ఆ భటుల్లో ఓ భటుడు.

"ఎలా తెలుస్తుంది? మీరంతా మా నాన్నగారికి అత్యంత ఇష్టులని నాకు తెలుసు. అదీకాక మీరు చెప్పాలిగాని, మరో పరమానవుడికి ఈ విషయం తెలియటానికి అస్కారం లేదుగా!" అన్నాను నేను.

"సరే.... ఇంతకూ విషయ మేమిటో చెప్పండి బాబూ! ఇలా యోగివేషంలో రాజమందిరంలో తిష్ట వెయ్యటానికి కారణమేమి టంటారు?" అన్నాడు ఆ భటుల్లో మరొకడు.

"చాలా పెద్ద కారణమేవుంది. అతి త్వరలో నేను రాకుమారిని పెళ్ళాడి ఈ దేశానికి మహారాజును కాబోతున్నాను. మా కొలువులో మీరంతా దండనాయకులు కాబోతున్నారు" అన్నాను.

నా మాటలకు వారంతా ఉక్కిరిబిక్కిరయ్యారు ఒక్కసారిగా.

"బాబూ! సింహాసనం ఎక్కాలేగాని, మమ్మల్ని అందలమెక్కించరూ? ఇంతకూ ఇప్పుడు మేమేం చెయ్యాలో చెప్పండి" అన్నారు వాళ్ళంతా.

"ఏమీలేదు. ఇక్కడ నేను ఓ పెద్ద నాటకం ఆడి ప్రస్తుతం ఈ రాజూ, మంత్రీ వలలో వేసుకున్నాను. వీళ్ళు నాలుగోరోజు ఉదయాన్నే ఇక్కడికి వస్తారు. ఈ లోగా



నేను నా మిత్రుడిని కలుసుకుని అతడి సహాయం పొందాలి. అతడు ఇప్పుడు ఇక్కడ లేకపోతే, నా ఆశయమంతా వ్యర్థమైపోతుంది" అన్నాను నేను.

ఓ భటుడు నా మాటలను అర్థం చేసుకుంటూ "అలా వ్యర్థమైపోకుండా వుండటానికి ఏం చెయ్యాలో చెప్పండి బాబూ! తప్పకుండా చేద్దాం" అన్నాడు.

"చెప్తానుగా! నా మిత్రుడైన ఓ వ్యక్తిని నేను ఇప్పుడు సరిగా అత్యవసరంగా కలుసుకోవాలని! అతడి చిరునామా ఇస్తాను. మీలో ఒకరు వెళ్ళి ఇక్కడికి తీసుకురావాలి అతన్ని. రాజమందిరంలోని తక్కిన వారల దగ్గర వుండే భటులా కూడా మీకు అవస్థ కాబట్టి. తిరిగి వచ్చేటప్పుడు ఏదో ఒకటి చెప్పి నా మిత్రుణ్ని నా దగ్గరికి చేర్పించండి" అన్నాను నేను.

"సరే ఎవరో ఒకరం వెళ్ళి మీ మిత్రుడ్ని ఇక్కడికి తీసుకువస్తాం. అతడి చిరునామా యివ్వండి బాబూ!" అన్నాడు మరో భటుడు.

నేను నా మిత్రుడి చిరునామా ఆ భటుడి చేతికి ఇవ్వగా, అతడు వెంటనే ఓ వ్యక్తికి ఆ చిరునామా ఇచ్చి అప్పటికప్పుడే అక్కడ్నుంచి పంపించాడు అతన్ని.

నేను ఆ భటులను ఆ విధంగా పూర్తిగా వలలో వేసుకుని, వాళ్ళతో ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ వుండగా, నా మిత్రుడికోసం వెళ్ళిన ఆ భటుడు అతన్ని తీసుకుని అక్కడికి వచ్చాడు.

నేను అతన్ని గదిలోకి తీసుకెళ్ళి నా పథకం వివరంగా చెప్పాను. ఆ మిత్రుడు రకరకాల మంత్రాలతో అరితేరిన వాడు.

అందువల్ల రాకుమారికి వశీకరణమంత్ర ప్రేరణతో వివ కర్తవ్యం బోధిస్తానని నాతో చెప్పాడు.

అయితే, ఆ మంత్ర ప్రయోగాన్ని ఆ దివసమే జరిపిస్తే, మంత్రికి, ఇతరులకు నామీద అనుమానం ఏర్పడి ఆ అనుమానం క్రమక్రమంగా నా మీదికి ఎక్కడ వచ్చిపడుతుందో నని ఆలోచించి, వాళ్ళకు యాగం పూర్తిచేస్తానని చెప్పిన రోజు తెల్లవారుఝామునే రాజపుత్రికతో రాజమందిరంనుంచి పలాయనం చిత్తగించాలని అనుకున్నాను

అందుకని నేను నా మిత్రుడితో కలిసి కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ, అప్పుడప్పుడు తలుపులు తీసి రాజభటులతో సరదాగా మాట్లాడుతూ మూడు రోజులు గడిపాము. మూడోరోజు తెల్లవారుఝామున మేము వున్న గదిలో ఏదో క్షుద్రపూజకు సంబంధించిన కొన్ని ముగ్గులూ, చక్రాలూ, చిత్రించి వాటి మధ్యలో నిమ్మకాయలు కోసి కుంకుమ జల్లి, శక్తిని ఆరాధించే వారి విధానం వాతావరణాన్ని సృష్టించాము.

ఆ తర్వాత—

నా మిత్రుడు వశీకరణ మంత్రాన్ని పఠించగా, ఆ మంత్ర ప్రభావం వల్ల రాకుమారి అంతఃపురంలోని తన గదిలో నిద్రపోతున్నదల్లా లేచి, మెల్లిగా నడుస్తూ నా దగ్గరికి వచ్చింది

నేను రాజభటులకు బహుమానాలు ఇచ్చి, త్వరలోనే నేను చేసిన వాగ్దానాలను నెరవేర్చుకుంటానని వారికి చెప్పి, మహారాజా, మంత్రి తెల్లవారాక అక్కడికి వచ్చినప్పుడు తనను గురించి అడిగితే ఏం చెప్పాలో బోధించి అక్క-



డ్నుంచి రాజపుత్రికతో సహా నా మిత్రుడిని వెంట పెట్టుకుని బయలుదేరాను.

నేను రాజమందిరం నుంచి అలా తెల్లవారుఝామున రాకుమారిని తీసుకుని నా మిత్రుడితో కలిసి రహస్యమార్గం గుండా బయటపడ్డాను.

సరిగ్గా ఆ సమయానికి రాజమందిరం వెలుపల ఓ సంకేత స్థలంలో రథంతో సిద్ధంగా వుండమని ఓ అనుచరుడికి అంతకు ముందే ఆజ్ఞ ఇచ్చాను కాబట్టి అతడు ఆ విధంగా వచ్చి వున్నాడు.

నేనూ, నా మిత్రుడూ, రాకుమారిని ఆ రథంలో కూర్చో పెట్టుకుని అక్కడికి ఆమడ దూరంలో గల ఓ రహస్య స్థావరం దగ్గరికి వెళ్ళాం.

అక్కడ రాకుమారిని వుంచి, కట్టుదిట్టమైన కావలా ఏర్పాటుచేసి నా మిత్రుణ్ణి ఓ పనికి నియోగించి నేను ఇలా ఇంటికి వచ్చాను.

ఇంతకు ముందే నా మిత్రుడూ వచ్చి నేను నియోగించిన విషయం గురించి వివరాలు అందజేసి వెళ్ళాడు.

రాజమందిరంలోని రక్షకభటులు నేను చెప్పినట్లే మహారాజుకూ, మంత్రికీ చెప్పారట

యోగి నిజమైన యోగి కాదనీ, ఎవడో క్షుద్రమాంత్రికుడు అలా యోగి రూపంలో వచ్చి, రాకుమారిని అపహరించుకుని వెళ్ళాడని వాళ్ళకు అనుమానం కలగాలని నేను చేసిన ఏర్పాటు సరైన ఫలితాన్నే ఇచ్చింది. రాజూ, మంత్రీ ఆ విధంగానే అనుకున్నారట! అందుకే దండోరా కూడా అలా వేయించారు "

ఆ విధంగా సుకీర్తి కైన తన మహత్కార్య సాధన విధానాన్ని తండ్రితో చెప్పి, గంభీరుడు తిరిగి ఇలా అన్నాడు.

"ఇప్పుడు చెప్పండి నాన్నా! మీ కుమారుడు ప్రయోజకుడా, కాదా?"

సేనాధిపతి కుమారుణ్ణి రెండు చేతుల్లో గాఢాలింగనం చేసుకుని, "ప్రయోజకుడివి మాత్రమే కాదు నాయనా! ప్రపంచమంతా కొనియాడదగిన కీర్తిమంతుడివి కూడా" అన్నాడు ఆనందంతో ఉప్పొంగిపోతూ.

ఆ తర్వాత—

తండ్రి కొడుకులిద్దరూ తమ భవిష్యత్ కార్యక్రమాన్ని గురించి చర్చించుకోసాగారు.

—అంతవరకూ ఆ గది బయట కిటికీ రెక్కమీద వాలి నుంచుని లోపలికి దాని చెవులు రిక్కించుకుని ఆ మాటలన్నీ విన్న ఓ పావురం అక్కడ్నుంచి రివ్వున ఎగిరి రాజసౌధం వైపుగా పయనం కొనసాగించింది!

## 12

రాజమందిరంలో మహారాజు చింతాక్రాంతుడై కూర్చుని వున్నాడు. ప్రక్కనే మంత్రి కూడా విచారవదనంతో కూర్చుని వున్నాడు. వాళ్ళిద్దరి దగ్గరగా కొంతమంది రాజ బంధువులూ, ప్రముఖులూ కూర్చుని వున్నారు.

"చిన్నతనం నుంచీ తల్లి లేని బిడ్డ కాబట్టి అల్లారు ముద్దుగా పెంచాను. నా చిట్టితల్లి ఎక్కడ ఏ బాధలు పడుతోందో ఏమో!" అన్నాడు మహారాజు డగ్గుత్తికతో.

"విచారించకండి ప్రభూ! కష్టకాలంలో ధైర్యంతో వ్యవహరించాలన్నారు పెద్దలు. ఈ విషమ సమస్యను వెతక



ఏం లాభం మహాప్రభూ దాగివుంది రాకుమార్తెదో ఎవరు చెప్పగలరు!" అన్నాడు మంత్రి.

వాళ్ళలా మాట్లాడుకుంటూండగా ఓ పావురం రివ్వు రివ్వున ఎగురుకుంటూ మంత్రి భుజంమీద వాలింది.

ఆ పావురం అలా అంత దగ్గరగా వచ్చి తన భుజం మీద వాలినందుకు మంత్రి విస్మయిస్తూ, దానిని చేతిలోకి తీసుకోవాలని ప్రయత్నిస్తూండగానే పావురం మెల్లగా అతని చెవిదగ్గరికి వచ్చి తన చిన్నని గొంతుకతో, మనుష్య వాక్కులతో, "మంత్రిగారూ! నేను మీకో రహస్యం చెప్పటానికి వచ్చాను. దయచేసి మీరు మహారాజుగారికి ఏదో ఒక సాకు చెప్పి మీ ఇంటికి రండి. అక్కడ కలుసుకుంటాను. ఈ విషయం ఎవరికీ చెప్పకండి" అని చెప్పి రివ్వు రివ్వున ఎగురుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

ఆ పావురం ఎవరో, అలా మనుష్య వాక్కులతో అది ఎలా మాట్లాడగలుగుతున్నదో, అది చెప్పదల్చుకున్న రహస్యం ఏమిటో అని పరిపరి విధాలుగా ఆలోచించిన మంత్రి మరికొంతసేపు మహారాజుకి ధైర్యం చెప్పి, అత్యవసరమైన పని వున్నదని చెప్పి తన ఇంటికి బయలుదేరాడు.

అర్ధరాత్రి అయింది. మంత్రి అంతవరకూ తన అనుచరులతో ఏదో విషయాన్ని తీవ్రంగా ఆలోచిస్తూ అప్పుడే ఆ గదిలోని పట్టు తెరల చాటున దాక్కున్నారు.

మంత్రి అనుచరులు కూడా పట్టుతెరల చాటుకి చేరుకున్నారు. ఆ మంత్రి శయనాగారం.

ఆ గదిలో ఓ పెద్ద మంచం మీద వుండే పరుపు మీద తలగడలు అటూ ఇటూ పరిచి నిద్రపోతున్నట్లు పేర్చి

ఇద్దాయి. పాటపైనే రాజావారు కప్పబడివుండటంతో నిజంగా అక్కడ మంత్రి నిద్రిస్తున్నాడనే భ్రమ కలుగుతుంది చూపరులకు.

మంత్రి, అనుచరులూ అలా పట్టుతెరల చాటుకి వెళ్ళగానే పావురం ఆ గదిలోకి వచ్చి, గదినంతా ఓ మారు పరిశీలనగా చూసి తిరిగి వెళ్ళిపోయింది.

అది వెళ్ళిన కాసేపటికి నలుగురు దృఢకాయులు క్రూరత్వం ఉట్టిపడే చూపులతో ఆ గదిలో ప్రవేశించారు.

వాళ్ళు ఒకర్నొకరు హెచ్చరించుకుంటూ మొలల్లోని కైజార్లను తీసి, నిశ్శబ్దంగా అడుగుల చప్పుడు కాకుండా మంత్రి పాన్పు దగ్గరికి వెళ్ళారు.

ఆ తర్వాత—

కళ్ళతోనే ఒకర్నొకరు హెచ్చరించుకుని నలుగురూ ఒకే సారి తమ తమ చేతుల్లోని కైజార్లను మంచంమీది దిండ్లల గ్రుచ్చి ఆ తర్వాత ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

వెంటనే—

మంత్రి తన అనుచరులతోసహా ఆవారున పట్టుతెరల చాటునుంచి బయటికివచ్చి "పాపాత్ములారా! నేను అక్కడ లేనురా. మీ రాక ముందుగానే తెలుసుకుని మీ కపటం పట్టడానికే ఇలా నాటకం వేసుకుని వున్నాను. మిమ్మల్ని ఈ పనికి వినియోగించినవాళ్ళకూ, మీకూ ఈ నాటితో భూమ్మీద నూకలు చెల్లిపోయాయి. మర్యాదగా మీ చేతుల్లోని కత్తులను క్రింద పారేసి లొంగిపోండి" అన్నాడు గంభీరంగా.

మరుక్షణం—



నలుగురు దుండగులూ ఒకర్నొకరు చూసుకుంటూనే ప్రతిఘటించుకుని, ఆ గదిలోంచి తప్పించుకుపోవటానికి వెనక్కి తిరిగి ముందుకు అడుగెత్తబోయారు.

అప్పుడే పావురం వింతగా అరుస్తూ కొంతమంది రాజభటులతో కలిసి ద్వారందగ్గర ప్రత్యక్షమైంది.

ఆ భటులు తమ చేతుల్లోని బల్లాలను, గండ్రగొడ్డళ్ళను గురిపెంచి, దుండగులకు మార్గనిరోధం కలిగించడంతో వాళ్ళు అటూ ఇటూ వెళ్ళలేక గుడ్లు మిటకరిస్తూ వుండిపోయారు.

"ఊఁ, ఆ పాపాత్ములను బంధించండి" అని మంత్రి ఆజ్ఞ యివ్వగానే కొందరు భటులు ఆ దుండగుల దగ్గరికి వెళ్ళి నిశ్చేష్టులై వున్నవాళ్ళ చేతుల్లోని కత్తులను లాక్కుని వాళ్ళని నలుగురినీ పెడరెక్కలు విరిచి కట్టివేశారు.

అప్పుడు—

పావురం మంత్రి భుజమ్మీద వ్రాలి "మంత్రిగారూ! ఇక్కడ పనిని నిర్విఘ్నంగా నెరవేర్చుకున్నాం. ఇక రాజమందిరానికి వెళ్ళి మహారాజుగారికి ఏర్పడబోయే ఆపదను కూడా ఎదుర్కోవాలి. త్వరగా మీ అనుచరులతోనూ కొంత మంది భటులతోనూ బయలుదేరండి. నేను అక్కడికే వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాను. ఈలోగా నేను ఆ దుండగులు బయలుదేరారో, ఇంకా ఆంజనేయస్వామి ఆలయం దగ్గరే వున్నారో కనుక్కుని, అక్కడ్నుంచి రాజమందిరంలోని మహారాజుగారి శయన గృహం దగ్గరికి వస్తాను" అని చెప్పి రివ్వున అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

# 13

పావురం రాజమందిరంలో ప్రవేశించి మహారాజుగారి కారాగారం దగ్గరికి వెళ్ళింది.

అక్కడ అంతకుముందు మంత్రి చేసిన ఏర్పాట్లను ఓసారి పర్యవేక్షణ చేసి, పావురం తిరిగి కారాగారం తలుపు రెక్కలదాకా వ్రాలింది.

అప్పుడే మంత్రి, కొందరు వీరభటులు ఆ కారాగారాన్ని సమీపించి అక్కడవుండే కుడ్యాల దాపున దాక్కున్నారు.

కొంతసేపటికి మంత్రి కారాగారంలోకి వెళ్ళిన దృఢకాయుల్లాంటి వ్యక్తులే ఇద్దరు రాజమందిరంలోని మహారాజు కారాగారంలోకి వచ్చారు. వాళ్ళు అటూ ఇటూ చూసుకుంటూ మెల్లిగా తలుపులు త్రోసుకుని లోపలికి వెళ్ళారు.

పాన్పు దగ్గరికి వెళ్ళి తమ తమ మొలల్లోని పిడిబాకుల్ని దూసి ఒక్కసారిగా అందరూ ఆ పిడిబాకుల్ని పాన్పు మీద వుండే శాలువమీద గబగబా పొడిచారు.

కాని——

ఆ శాలువక్రింద వుండే తలగడలు అటూ వొరిగిపోయి బయటపడేసరికి వణుకుతూ తెల్లమొహం వేశారు.

అంతలో——

బయటినుంచి మంత్రి, మంత్రి అనుచరులైన వీరభటులూ, కుడ్యాలచాటు నుంచి ఆ కారాగారంలోకి వచ్చారు.

ఆ సమయంలోనే——

మహారాజు మరికొంతమంది రాజభటులతో కలిసి ఇంకో వేపునుంచి వచ్చారు.



పావురం రివ్వుమంటూ ఎగిరి వచ్చి కిలకిల నినాదాలు చేసింది.

"ఓరి, ద్రోహులారా! ధర్మాత్ముడైన మన ప్రభువుకే ద్రోహం తలపెట్టటానికి పాల్పడిన మీకు తప్పుపాటే గతి! ఎవరో అధముడు ఇచ్చే బహుమతికి ఆశపడి ఇంత పాపానికి పాల్పడ్డారు. దీని ఫలితం అనుభవించటానికి సిద్ధంగా వుండండి" అని ఆ దుండగులను పట్టుకుని వారిని పెడరెక్కలు విరిచి కట్టారు.

మంత్రి మహారాజుతో "ప్రభూ! ఇప్పటికి ఈ పావురం చెప్పినవి రెండూ నిజమై, మనం ఆ దుర్మార్గుడి పాపిష్ఠి పథకంనుంచి తప్పించుకున్నాం. ఇక—— అమ్మాయిగారి సంగతి కూడా ఈ పావురానికి తెలుసునట! మనం వెంటనే బలగంతో వెళ్ళి అమ్మాయిగారిని విడిపించి తీసుకురావాలి" అన్నాడు.

"మంత్రిగారూ! ఈ పావురం నిజంగా దైవాంశంతో వెలసినదిగా అగుపిస్తోంది. అమ్మాయి ఎక్కడవుందో అడగండి" అన్నాడు మహారాజు.

"మహారాజా! మీ పుత్రికా రత్నాన్ని మీ ప్రాణశత్రువైన గండికవదవేవాడు యిక్కడికి దగ్గరలో వుండే ఓ కొండ గుహలో నిర్బంధించి, అక్కడ కట్టుదిట్టమైన కాపలా పెట్టాడు. కపటయోగి వేషంతో వచ్చి, మిమ్మల్ని వంచించి, వశీకరణ ప్రయోగంతో ఆమెను తీసుకెళ్ళాడు ఆ దుష్టుడు. యాగం చెయ్యటానికి ఏర్పాటు చేసిన గని ముందు కాపలా పెట్టిన

భటులు ద్రోహులు! వాళ్ళ సహకారంతోనే ఆ దుర్మార్గుడు రాకుమార్తెను అవలీలగా అపహరించగలిగాడు!" అంది పావురం మనుష్య వాక్కులతో.

మంత్రి వెంటనే భటులవేపు తిరిగాడు.

"విన్నారా, మీరు ఆ భటులను కూడా బంధించి, మీతో బాటు చెరలో పడెయ్యండి! వెళ్ళండి" అన్నాడు.

భటులు ఆ దుండగులను అక్కడినుంచి లాక్కెళ్ళారు.

ఆ తర్వాత మహారాజుకు, మంత్రికి రాకుమార్తెను బంధించిన చోటును వివరంగా చెప్పి పావురం "ఇప్పుడు ఆ గంభీరుడూ, సేనాపతీ అక్కడికే వెళ్ళారు. అక్కడ తాము పంపిన తమ మనుష్యులవల్ల మీరు మరణించి వుంటారని, ఇక నిర్భయంగా రాణిని తిరిగి నగరానికి తీసుకురావచ్చునని, రాజ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆ యువతిని బలవంతంగా తన కుమారుడికి యిచ్చి వివాహం జరిపించాలని ఆ దుష్ట సేనాపతి సంకల్పం" అంది.

వెంటనే—

మంత్రి మహారాజుతో ఇలా అన్నాడు—

"అయితే, ఇంకా ఆలస్యం ఎందుకు ప్రభూ! వెంటనే బలాన్ని తీసుకువెళ్ళి వాళ్ళ పీచమణచి అమ్మాయిగారిని విడిపించుకువద్దాం పదండి" అన్నాడు మంత్రి.

అప్పటికి మనస్సు కుదుటపడిన మహారాజా ఉత్సాహంతో "అలాగే" అన్నాడు.

## 14

తెల్లవారేసరికి శ్రీరంగపట్టణం వీరభటులు నల్లమల అడవుల్లోని ఓ కొండగుహ చుట్టూ సాయుధులై ముట్టడించారు.



పావురం చూపించిన దారి వెంటపడి వచ్చిన మహారాజా, మంత్రి, వీరవేషాలతో తమ భటులకు నాయకత్వం వహించారు.

పావురం "మహారాజా! మంత్రిగారూ, భటులూ, మీరూ గుహ లోపలికి రండి" అని చెప్పి గుహ లోపలికి వెళ్ళింది.

వారంతా పావురం చెప్పినట్లు గుహలో ప్రవేశించారు.

వాళ్ళు వెళ్ళేసరికి రాకుమార్తె ఓ తిన్నె మీద కూర్చుని ఏడుస్తోంది. ఆమెకు ఇరువేపులా నిల్చుని గంభీరుడూ, సేనాపతి ఏవేవో ప్రగల్భాలు పలుకుతూ బెదిరిస్తున్నారు.

వాళ్ళ చుట్టూ సాయుధులైన కొంతమంది అనుచరులు నిల్చుని వున్నారు.

పావురం సరాసరి రాకుమారి భుజంమీద వ్రాలి "మహారాణీ! నేను నీ బంగారు లేడిని—వచ్చాను! ఇక విచారించకు" అంది.

ఆ మాటలకు సేనాపతీ, గంభీరుడూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

మహారాణీ రాకుమారి ఆ పావురం మానవ వాక్కులను ఉచ్చరించటానికి విస్తుపోతూ, దానిని చేతుల్లోకి తీసుకోబోయింది.

పావురం చటుక్కున క్రిందికి వ్రాలి, అప్పుడే అక్కడికి వచ్చిన మహారాజా, మంత్రి ఆశ్చర్యపోతూండగా బంగారు లేడిగా మార్పు చెందింది.

రాకుమారి తండ్రిని, మంత్రిని, వాళ్ళ వెంబడి వచ్చిన వీరభటుల్ని, తన బంగారు లేడిని చూడగానే పట్టరాని ఆనం

దంతో అక్కడినుంచి లేచి ప్రక్కకు వెళ్ళనిల్చుంది.

బంగారు లేడిని చూసి గంగవెఱ్ఱులెత్తుతున్న సేనాపతి, గంభీరుడికీ, కళ్ళు చెదిరిపోయేటట్లు బంగారులేడి నవ యౌవన సుందరాకారుడైన ఓ రాజపుత్రుడుగా మారిపోయాడు.

మహారాజు మంత్రి, తక్కినవాళ్ళూ దిగ్భ్రాంతితో ఆ దృశ్యాన్ని చూశారు.

గంభీరుడు ఆ రాజపుత్రుణ్ణి కోపంతో చూస్తూ, "వీడు దేవతో మాయగాడు. ముందు వీడిని పట్టుకోండి" అని బిగ్గరగా అరిచాడు.

ఆ రాజపుత్రుడు వెంటనే తన ఒరనుంచి జరాలున కరవాలాన్ని దూసి, గంభీరుడి ముఖం ముందు భయంకరంగా ఝళిపిస్తూ, "మాయలూ, మంత్రాలూ నేర్చిన నమ్మకద్రోహీ! నేను స్వర్ణపురరాజ్య రాజపుత్రుడిని. నా పేరు జయంతపాలుడు. దేవేంద్రుడి పుత్రికయైన జయంతికుమారికి శాప విముక్తిని కలిగించే ప్రయత్నంలో ఇక్కడికి రావటం జరిగింది. నేను వచ్చిన వేళావిశేషంవల్ల నీవంటి పాపాత్ముల ఈ రాజ్యానికి, ఈ మహారాజుకూ హానిచెయ్యకుండా కాపాడగలిగే అవకాశం నాకు లభించింది. నా పరకాయప్రవేశ విద్యా ప్రభావంతో నేను రకరకాల రూపాలు ధరించి, రాకుమారి ఆత్మీయతను సంపాదించుకుంటూ, నీ మోసాన్ని తెలుసుకో గలిగాను.

రాజపుత్రిని మన్మథ వశీకరణంతో మాయం చేసుకుని తీసికెళ్ళడం జరిగింది. అప్పట్నుంచి పావురం రూపంలో



నీవలా నిన్నూ, నీ తండ్రినీ వెన్నాడుతూ నీ దుష్టచర్యల నన్నిటినీ తెలుసుకున్నాను. మవ్వూ, నీ వాళ్ళు పంపిన అనుచరులందరినుంచి మహారాజుగారినీ, మహామంత్రిగారినీ తప్పించుకుపోవటం చేశాను. ఇప్పుడు నీ పని పట్టటానికే వచ్చాను. ఇక నా చేతినుంచి నిన్ను ఈ ప్రపంచంలో ఎవరూ కాపాడలేరు" అని ఎడంకాలు పైకెత్తి గంభీరుడి డొక్కలో ఒక్కతన్ను తన్నాడు.

ఆ తన్నుకు విలవిల్లాడుతూనే గంభీరుడు ఒరనుంచి కత్తి దూసి జయంతపాలుణ్ణి ఎదుర్కొన్నాడు.

జయంతపాలుడు చెప్పిన వింత వృత్తాంతాన్ని ఆనందంతో ఆలకించిన మంత్రి మహోత్సాహంతో మహారాజును చూస్తూ "ప్రభూ! ఈ దుర్మార్గులను వధించడంలో మనం కూడా జయంతపాల యువరాజుగారికి తోడ్పడదాం" అని ఒరనుంచి కత్తి దూసి శత్రు భటులమీద విరుచుకుపడ్డాడు.

మహారాజు కూడా కత్తి దూసి, అప్పుడే వెనుకనుంచి జయంతపాలుణ్ణి దొంగదెబ్బ కొడదటానికి ప్రయత్నిస్తోన్న సేనాధిపతి కత్తికి తన కత్తిని అడ్డంపెట్టి ఆ దుర్మార్గుణ్ణి ఎదుర్కొన్నాడు.

మంత్రి తీసుకునివచ్చిన వీరభటులు సేనాధిపతి భటులను ఎదుర్కొన్నారు.

ఆ గుహలో ఇరుపక్షాలకు భీకరమైన పోరాటం జరిగింది.

అంతకాలంనుంచి తనతో ముచ్చటలాడుతూ, తన పాన్పు మీదనే శయనిస్తూ, తనలో ఒక భాగంగా కలిసిపోయిన బంగారులేడి — నీల సుందరమూర్తియైన ఓ రాకుమారుడై

వందుకు మహాసిని హృదయంలో పొంగళ్ళ పుంటికలు మ్రోగాయి. ఆ అవకాశం కన్నార్పకుండా ఆ రాజనందనుడి వైపే చూస్తుండిపోయింది.

జయంతపాలుడు తన అస్త్రవిద్యానైపుణ్యం తేటతెల్లమయ్యేట్లు గంటభేరుండమీద విల్లు ఎక్కుపెట్టి భీకరమైన శరాలెన్నో నెరిపి, కొంతసేపటికి ఆ దుర్మార్గుణ్ణి హతమార్చాడు.

అప్పటికి మహారాజు చేతిలో సేనాని, మంత్రి, వీరభటుల చేతుల్లో సేనాని అనుచరులు కూడా హతులైపోయారు.

రాజపుత్రి పరుగెత్తుకుంటూ వెళ్ళి తండ్రిని కౌగిలించుకుంది. మహారాజు పుత్రికను లేవదీసి పట్టుకుని ఆనందబాష్పాలు రాల్చాడు.

అనంతరం—

మంత్రి జయంతపాలుడి దగ్గరికివచ్చి, "నాయనా! నీ మాటలవల్ల నువ్వెవరివో తెలుసుకున్నాం గాని, దేవేంద్రుడి పుత్రికకు శాపవిముక్తిని కలిగించటమెలాగో అర్థం కావటం లేదు. నీ రాకవల్ల మా అందరి జీవితాలకు శుభం కలిగింది" అన్నాడు.

"మంత్రిగారూ! జయంతికి నేను శాపవిముక్తి కలిగించాలంటే, జయంతి ప్రతిరూపమైన మీ రాజపుత్రి ప్రేమను పొందగాలి. ఈ సుందరీమణికి యౌవనం అంకురించటోనే సమయంలోనే జయంతికి శాపవిమోచనం నా వల్ల కలగాలని ఒకానొక ముని శాపం ఇచ్చాడు. నేను అప్పటికే ఎన్నో కష్టాలకోర్చి, ఈ సముద్ర మధ్య ద్వీపం చేరుకున్నాను.



గంటభేరుండపక్షి రూపంలో ఆకాశమార్గాన వెళుతూండగా— క్రింద ఈ అడవిలో అద్భుతమైన కోలికలతో ఉన్న మీ రాజపుత్రిని చూశాను. మునీశ్వరుడి సంకల్పశక్తి నన్ను ప్రేరేపించగా, నేను క్రిందికి వాలి, బంగారులేడి రూపం ధరించి ఆమె దగ్గరికి చేరుకున్నాను ఆ తర్వాత జరిగిందంతా మీకు తెలిసిందే" అని జయంతపాలుడు అంతకుముందు జరిగిన విశేషాలన్నిటినీ— అంటే తాను తన మిత్రుడైన చంద్రపాలుడితో కలిసి వేటకు వచ్చినప్పటినుంచి అప్పటి దాకా పూర్తిగా అన్ని వివరాలను చెప్పాడు.

అంతా విన్నతర్వాత మహాసిని సిగ్గుతెరలు ముంచుకొస్తుండగా, ఓరగా జయంతపాలుణ్ణి చూస్తూ, తల దించుకుంది. మహారాజు జయంతపాలుడి దగ్గరికి పుత్రికను తీసుకువచ్చి "నాయనా! నిన్ను భగవంతుడే మా దగ్గరికి పంపించాడు. నువ్వు కావాలనుకున్న నా పుత్రిక ఇక నీ పాదాల చెంతకే తన జీవితాన్ని అంకితం చేస్తుంది" అన్నాడు.

"మహారాజా! నా వృత్తాంతమంతా చెప్పానుగా! నేను నా తల్లిదండ్రులకు, ఆప్తులకు ఎవరికీ తెలియకుండా బయలుదేరి వచ్చిన లక్ష్యం ఎంత గొప్పదో తెలుసుకున్నారుకదా! తిరుగుప్రయాణంలో మిమ్మల్ని తప్పకుండా కలుసుకుంటాను. మొదట కాళీమాత నాకు పరకాయప్రవేశ విద్యను అనుగ్రహించింది. మునీంద్రుడి సంకల్పశక్తి నాకు కామరూప శక్తిని కూడా అనుగ్రహించింది. ఇక నేను యథాప్రకారం గంటభేరుండం రూపం ధరించి ముందుకు ప్రయాణిస్తాను. సెలవు" అని మహారాజుకు, మంత్రికి నమస్కరించి, తన

వేష శక్తి విషయాలతో దేవుణ్ణి శోధించుకుని వెల్లువిరుస్తున్న
టులకు చెయ్యి పూని చెప్పి, మహామణి కాముమారిని
ప్రేమతో వీక్షించి, జయంతుడు కళ్ళు మూసుకుని మనస్సులో
మసీం దర్శి స్మరించుకుని గండభేరుండం రూపాన్ని
ధరించాడు.

మరుక్షణం—

అక్కడివారంతా విభ్రాంతులై చూస్తూండగా గండభేరుండ
రూపుడైన జయంతపాలుడు అక్కడినుంచి పైకి ఎగిరి,
రవేగంతో ముందుకు పయనించసాగాడు.

శ్రీరంగపుర ద్వీపభూభాగం అతిక్రమించి, అతడు మరి
ంత సేపటికే నీటిపట్టం మీదుగా ప్రయాణించసాగాడు

## 15

జయంతపాలుడు గండభేరుండ రూపంలో లవణ సము
ద్రాన్ని దాటాడు. ఆ తర్వాత కాస్త విశ్రాంతి తీసుకుని
రెండవ సముద్రాన్ని కూడా దాటాడు

క్రమక్రమంగా ఏడు సముద్రాలుదాటి జంబూ ద్వీపంలో
ప్రవేశించి, ఆ ద్వీపమంతటా కలియతిరిగి, చివరకు అగ్ని
సరస్సు దగ్గరికి చేరుకున్నాడు.

ఆ సరస్సు గట్టున నిల్చుని, నీటి మధ్యకు ఓసారి
దృష్టిని ప్రసరింపజేశాడు.

అంతవరకూ ఎర్రగా ప్రశాంతంగావున్న ఆ సరస్సులోని
రు ఒక్కసారిగా పొగలను, సెగలను చిమ్ముతూ అగ్ని
ని గట్టు మీదికి చిమ్మింది.

గండభేరుండ రూపుడైన జయంతుని శరీరం భగ్గున



మండిపడ్డట్లయింది.

మరుక్షణం—

రివ్వున ఎగిరి గట్టుకు కొంచెం దూరంలో నిల్చుని
సరస్సులోకి మళ్ళీ చూసింది.

అగ్నిశిఖ యథా ప్రకారం ప్రశాంతంగా కనిపించింది. ఆ
సరస్సు గట్టుకు ఎవరైనా చేరుకుంటే, అగ్నిశిఖ విజృంభిస్తుందనీ, వైశ్వానర పుష్పానికి అది ఒక రక్షణ అనీ,
అలాంటి రక్షణలు ఇంకా కొన్ని వుంటాయనీ ఊహించాడు
జయంతుడు

ఆ సరస్సులో ప్రవేశించి వైశ్వానర పుష్పాన్ని ఎలా
సాధించాలా అన్న ఆలోచనలో పడిపోయాడు జయంత
పాలుడు.

తాను అగ్నిశిఖని అవహించి, అది పైకి వుబికేటప్పుడా,
వేడిని తప్పుకోకుండా చేయగలడు

అయితే -

ఆ సరస్సులోకి వైశ్వానర పుష్పాన్ని తెచ్చేది ఎవరు?

అప్పుడతడికి గంధర్వ కన్యయైన చిత్ర జ్ఞాపకం వచ్చింది.
జయంతపాలుడు సంతోషంతో తన మెడలోని హారాన్ని
ముక్కుతో స్పృశిస్తూ, "చెల్లీ, చిత్రా!" అని పిలిచాడు.

మరుక్షణం -

దివ్యకాంతులతో ఆ పరిసర ప్రదేశాన్ని తాత్కాలిక
మాత్రంగా ప్రకాశింపజేస్తూ, చిత్రావతిదేవి అక్కడ ప్రత్యక్ష
మైంది. ఆమె జయంతపాలుడికి నమస్కరిస్తూ "అన్నయ్యా!
ఏమిటి ఆజ్ఞ!" అంది చిరునవ్వుతో.

"చెల్లీ! నువ్వు ఆనాడు ఆ మాట చెప్పివుండకపోతే

ఇప్పుడు చిక్కుల్లో పడిపోయేవాడివి. సమయానికి మువ్వ నాకు గొప్ప సహాయం చెయ్యగలిగింది.

విను ఇంకో -

ఈ అగ్నిసరస్సులోని ఉష్ణజలాన్ని నేను నా పరకాయ ప్రవేశ విద్యా ప్రభావంతో స్తంభింపజేస్తాను. ఒక్క బ్రాహ్మ కోటి సృష్టికాలంలో తప్ప, చరాచర ప్రకృతిలోని ఏ వస్తువు మీదనైనా నా ప్రభావం పనిచేసేట్టు కాళీమాత నాకు వరం యిచ్చింది. ఇప్పుడు నేను అగ్నినీటిని స్తంభింపచేసిన సమయంలో మువ్వ సరస్సులో ప్రవేశించి సరస్సు మధ్యనవున్న వైశ్వానర పుష్పాన్ని సంగ్రహించుకుని, గట్టుకు చేరుకోవాలి. నేను అగ్నిసరస్సును విడిచిపెట్టేలోగా మువ్వ గట్టు మీదనుంచి ఇక్కడికి రావాలి" అన్నాడు.

"అలాగే అన్నయ్యా! మీరు మీ ప్రయత్నం కొనసాగించండి" అంది చిత్ర.

జయంతపాలుడు తన సంకల్పశక్తిని అగ్నిసరస్సులోని నీటిలో ప్రవేశపెడుతూ, కాళీమాతను స్మరించుకున్నాడు.

గండభేరుండం మెడ ప్రక్కకు వాల్చి, నేల మీదికి ఒరిగిపోయింది.

జయంతపాలుడు అగ్నినీటిని ఆవహించగానే ఆ నీరు తన ప్రకోపాన్ని చూపలేకపోయింది.

గండభేరుండం మరణించగానే జయంతపాలుడి ఆత్మశక్తి ఆ పక్షినుంచి విడిపోయిందనీ, అది అగ్నినీటిని ప్రవేశించిందనీ గ్రహించింది చిత్ర.

వెంటనే -



జయంతపాలుడు చెప్పినట్లు గట్టు దగ్గరికి వెళ్ళి నిల్చుంది చిత్ర. నీరు నిశ్చలంగా వుండటం గ్రహించి అక్కడినుంచి నీటి మీదుగా సరస్సు మధ్యలోకి వచ్చి, వైశ్వానర పుష్పాన్ని తీసుకుని తిరిగి సరస్సు గట్టు మీదికి వచ్చింది.

జయంతపాలుడు ఇక అగ్నినీటిలోని తన ఆత్మశక్తిని ఉపసంహరించుకుంటాడనీ, అందువల్ల ఆ నీరు తాను గట్టు మీద వున్నట్లయితే, విపరీతమైన వేడి పుంజాలని తనమీదికి విసురుతుందనీ గ్రహించి, గంధర్వకన్య ఆ గట్టునుంచి క్రిందికి దిగివచ్చి గండభేరుండం దగ్గరికి వచ్చింది.

అప్పటికే జయంతపాలుడు అగ్నినీటిని విడిచిపెట్టి గండభేరుండంలో ప్రవేశించినందువల్ల గండభేరుండం జీవకళతో ఉట్టిపడుతూ లేచింది.

"అన్నయ్యా! ఇదిగో వైశ్వానర పుష్పాన్ని తెచ్చాను" అంది చిత్ర.

"చాలా సంతోషం చెల్లీ! ఆ పుష్పాన్ని ఇటియ్యి, ఇక మీ లోకానికి మువ్వ వెళ్ళొచ్చు!" అన్నాడు జయంతపాలుడు.

చిత్ర అలాగే చేసింది.

ఆ తర్వాత -

జయంతపాలుడు వైశ్వానర పుష్పాన్ని తన ముక్కుతో కరచుకుని రెక్కలు విదలిస్తూనే పైకి లేచాడు.

కొద్దిదూరం లేచినతర్వాత. విజయోత్సాహంతో ముందుకు ప్రయాణించాడు అతడు!

## 16

ఆది దక్షిణ సముద్ర మధ్యంలో వెలసిన ఓ పర్వతం మీద

దీవి. ఆ దీవిలో వెలసిన ఓ కాళీ ఆలయంలో — క్షుద్ర మంత్రాలు చదువుతూ, ఓ భీకర రూపుడైన మాంత్రికుడు కనిపించటమూ, తాను కాళ్ళూ చేతులూ బంధింపబడివుండటమూ చూస్తూ ఆ రాకుమారి భయభ్రాంతురాలై కాపొగింది.

అసలు ఇక్కడికి తాను ఎలా కొనిరాబడిందో? ఎంత ఆలోచించినా ఆమెకు అర్థంకాలేదు.

తన మందిరంలో -

హంసతూలికా తల్పం మీద పడుకునివుండగా, ఈ మాయావి తన మంత్ర విద్యతో ఇక్కడికి తీసుకువచ్చాడేమో!....

అసలు ఇక్కడ తనను ఎందుకు కట్టిపడేశాడు?

ఎందుకో ఏమిటో?

ఈ కాళీమాతకు బలియివ్వటానికే అయివుంటుంది!

ఏ ఏమైన క్షుద్రవృత్తి కలిగిన ఈ దుర్మార్గుడు ఏదో ప్రయోజనాన్ని ఆశించి, తనను ఇక్కడ బలిపెట్టేందుకు తెచ్చాడనటంలో సందేహం లేదు.

అదిగో —

వాడి ప్రక్కనే బలిఖడ్గం కూడా వుంది.

ఇక ఈనాటితో తనకు ఈ లోకంతో తెగతెంపులు అయినట్టే!

ఆ విధంగా ఆలోచిస్తూ, ఆ యువతి తన తల్లిదండ్రులనూ, ఆప్తులనూ తలుచుకుంటూ కన్నీరు విడవసాగింది.

మాంత్రికుడు మంత్రపఠనం పూర్తిచేశాడు.

ప్రక్కనవున్న బలిఖడ్గాన్ని అందుకుని, కాళీవిగ్రహం కేసి చూస్తూ, "అంబా! సర్వ విద్యా విశారదురాలా, పవిత్ర



గుణశీల, వివాహం కావటువంటి కన్యామణి, దేవతాంశతో కూడి త్రిభువనాలలో జన్మించిన సుందరి అయిన ఈ రాకుమారిని మీకు నైవేద్యం పెడుతున్నాను. నన్ను కరుణించి, నా యీప్సితార్థం నెరవేర్చు తల్లీ!" అని ప్రార్థించి కత్తి నెత్తి వ్రేయబోయాడు

అంతకుముందు గగనవీధిలో ప్రయాణిస్తూ ఆ ద్వీపం మీదుగా వచ్చిన గండభేరుండం క్రింది దృశ్యాన్ని చూసి, అప్పటికే ఆలయంలో ప్రవేశించివుంది!

మాంత్రికుడు కత్తినెత్తి రాజపుత్రికను ఖండింపటానికి పూనుకోగానే — గండభేరుండం తనముక్కునవున్న వైశాల్య వరపుష్పాన్ని క్రింద వుంచి పక్షపుటాలను విప్పారించుకుని ముక్కును సారించి మహోగ్రంగా ముందుకు దూకింది.

మాంత్రికుణ్ణి రెప్పపాటుకాలంలో సమీపించి, అతడి కత్తి వడిగా రాజపుత్రి కంఠం మీద పడబోతుండగా కాళ్ళతో బలంగా కత్తిని ఎగురగొట్టింది.

కత్తి దూరంగా పడగానే, ముక్కుతో మాంత్రికుడి శిరస్సును గట్టిగా పొడిచింది.

ఆ పోటు తల మీద పిడుగుపాటువంటి బాధను కలిగించగా, మాంత్రికుడు గంగవెర్రులెత్తి కూలిపడబోతూ, అంతలో నిలద్రొక్కుకుని తల త్రిప్పి చూశాడు.

ప్రాణం పోసుకున్న మృత్యుమహాకాళిలా అతి భీకర రూపంతో తనమీదికి మళ్ళీ దూసుకొస్తున్న ఓ గండభేరుండం కన్ను చెదరిపోయేట్లు కనిపించగానే, మాంత్రికుడి గుండెలు అవిసిపోయాయి.

అతడు క్షణకాలం ప్రూన్పడిపోయాడు. అంతలోనే తనను తాను దిటవుపరచుకున్నాడు. ఆ గండభేరుండాన్ని ఎదుర్కొనటానికి సిద్ధపడేలోగానే, గండభేరుండం విసురుగా వచ్చి, మళ్ళీ కాళ్ళతో బలంగా అతడి ముఖంమీద తన్నింది.

ముఖం పగిలి కండరాలతోపాటు నెత్తుటిధారలు ఎగసి ధారాపాతంగా క్రిందపడుతూండగా, మాంత్రికుడు ఆ ఆలయం ప్రతిధ్వనించేట్లు ఓ గావుకేకవేసి విసురుగా వెనక్కు తూలి పడిపోయాడు.

అంతఃపురాల్లో విగ్రహం వెనుక దాగి చూస్తున్న రాజపుత్రి అత్యంత ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ ఆ గండభేరుండంవేపే చూడసాగింది.

అక్కడ—

ఆపద్దైవంలా ఆవిర్భవించి, అతి భీకర పరాక్రమంతో మాంత్రికుణ్ని తలపడి ఆ పాపాత్ముణ్ని హింసిస్తోన్న గండభేరుండపక్షి వరేణ్యానికి విజయం కలిగించమని కాశీవిశ్వనాథుణ్ని ధ్యానిస్తుంటూ, ఆ యువతి అలాగే చూస్తుండిపోయింది.

మాంత్రికుడు క్రిందనుంచి లేచి, క్రోధంతో గండభేరుండాన్ని చూస్తూ, మంత్రపఠనం చెయ్యటానికి ప్రయత్నించాడు.

ఆ మాంత్రికుడి మంత్రం తన మీద పారితే, తన అస్తిత్వానికి ఏదైనా ప్రమాదం వాటిల్లవచ్చునని భావించి గండభేరుండం ముక్కుపుటాలను పాదించి, తీవ్రంగా ముందుకురికింది.

అంతే!....

మంత్రపఠనం చేస్తోన్న మాంత్రికుడి నోటిలోని నాలుక



గండభేరుండం ముక్కుదాటికి తునకలు పీలికలు కావటం, మాంత్రికుడు గట్టిగా అరుస్తూ చిందులువేయటం క్షణాలమీద జరిగాయి.

గండభేరుండం ఆ దుష్టమాంత్రికుడి జీవితాన్ని అంతటితో పరిసమాప్తి పొందించటానికే నిశ్చయించుకుని వున్నదానిలా, మళ్ళీ, ముందుకురికి, ఈసారి మాంత్రికుడి గొంతుకలో ఒక్కపోటు పొడిచింది.

పదునూ, వాడితనమూ కలిగిన ఆ పక్షిరాజు ముక్కుపోటుకు గొంతుక రక్తం ప్రవాహాలుకాగా, మాంత్రికుడు ఆలయం ప్రతిధ్వనించేట్లు చివరసారిగా అరచి నేలపడి గిలగిల కొట్టుకుంటూ ప్రాణాలు విడిచాడు.

ఆ విధంగా—

గండభేరుండం అతి భీకరపరాక్రమాన్ని ప్రదర్శించింది. లోకకంటకుడైన మాంత్రికుణ్ని హతమార్చి అదుపూకి క్షేమంగా వెళ్ళింది.

తనను కృతజ్ఞతతో చూస్తోన్న ఆ యువతిని వాత్సల్యంతో చూస్తూ, గండభేరుండం ముక్కుతో ఆమెను బంధనాలనుంచి విముక్తి కలిగించింది.

రాకుమారి లేచి, గండభేరుండ పక్షికి నమస్కరిస్తూ, "పక్షిరాజమా! పూర్వం సీతామహాదేవిని రావణాసురుడినుంచి రక్షించటానికి ప్రయత్నించిన జటాయువులా ఈ దుష్ట మాంత్రికుడి బారినుంచి నన్ను రక్షించటానికే వచ్చావు. నిన్ను కలకాలం దైవంలా కొలుచుకుంటాను" అంది.

"రాజపుత్రీ! మనసులో మనకు ప్రశంసలూ, కృతజ్ఞతలూ చెప్పి నిన్ను ఈ పాపాత్ముడిబారినుంచి కాపాడగలిగిన అద

రాకాసిన్ని, శక్తినీ ప్రసాదించిన ఈ కాళీమాతను ఇలాసేవిస్తూ పూజించుకో."

ఇక—

"ఈ సముద్ర మధ్యలోని దీవినుంచి నిన్ను అవతలిగట్టుకు చేర్చిస్తాను. ఆ తర్వాత నీ వివరాలు చెబితే నిన్ను నీ తల్లి దండ్రుల దగ్గరికి చేర్చిస్తాను" అంది గండభేరుండం మానవ భాషలో.

ఆ పక్షిరాజు అంత స్వచ్ఛమైన మానవభాషలో మాట్లాడి నందుకు రాకుమారి విస్తుపోతూ, ఆశ్చర్యంతోనూ, ఆయో మయంతోనూ చూడసాగింది.

"రాకుమారీ! ఇక్కడ కాలయాపన చేయడం ఉచితం కాదు. నువ్వు నా వీపు మీద కూర్చో. నిన్ను సురక్షితంగా తీసుకువెళతాను" అంది గండభేరుండం మళ్ళీ.

రాజపుత్రి ఆ పక్షిరాజునే పరీక్షగా చూస్తూ, అందులో ఏదో మహాత్మ్యం వుందని గ్రహించి, మారుమాట్లాడకుండా అతడి వీపు మీద కూర్చుని, మెడ మీద చేతులు వేసి పట్టు కుంది.

గండభేరుండం కాళీమాతకు నమస్కరించింది. వైశ్యాకర వృక్షం వున్న చోటుకి వెళ్ళి, ఆ వృక్షాన్ని నోట కరచు కుని అక్కడ్నుంచి పైకి ఎగిరింది!

## 17

ప్రియమిత్రుడూ, భావి ప్రభువూ అయిన జయంతపాలుడ్ని వెతుకుతూ చంద్రమోహనుడు ఎన్నెన్నో ప్రదేశాలు తిరిగాడు.



అతడికి జయంతమిత్రుడ్ని గురించి ఆధారం ఏదీ దొరకలేదన్న బాధ ఈ జన్మలో తన మిత్రుడు కనిపిస్తాడో లేదో అన్న ఆందోళన చెందుతూ, అంతలోనే ధైర్యాన్ని పుంజుకుంటూ ఎప్పటికప్పుడు నూతనోత్సాహాన్ని కొనితెచ్చుకుంటూ, ఎప్పటికైనా ప్రియమిత్రుని కలుసుకోగలనన్న పట్టుదలతో ప్రయాణం కొనసాగించాడు!

ఒకరోజు—

ఒక గ్రామంలోని ఓ వృక్షందగ్గర జనమంతా గుమిగూడి వుండటం చూసి, చంద్రమోహనుడు తన గుర్రాన్ని నడిపించుకుంటూ ఆ వృక్షం దగ్గరికి వెళ్ళాడు.

"బాబూ! ఇక్కడ ఇంతమంది గుమిగూడి వుండటానికి కారణమేమిటి?" అని అడిగాడు చంద్రమోహనుడు ఓ గ్రామస్థుణ్ని చూస్తూ.

"ఈ చుట్టు ప్రక్కల గ్రామాలన్నిటిలోకి పేరుమోసిన ఓ జ్యోతిష్కుడు వున్నాడు. ఆయన ఎంత చెబితే అంత జరిగి తీరుతుంది. మా గ్రామానికి ఆ మహావీరుడు నెలకొకసారి వస్తాడు. ఇప్పుడు ఇక్కడ ఇంతగుంపు ఏర్పడటానికి కారణం ఆ జ్యోతిష్కుడి రాకమాత్రమే!" అన్నాడు ఆ గ్రామస్థుడు.

"అలాగా! ఆ మహావీరుడు అంత గొప్పవాడన్న మాట!" అన్నాడు చంద్రమోహనుడు.

"అవును బాబూ! తమరు ఏమైనా అడగాలనుకుంటు న్నారా?" అని అడిగాడు గ్రామస్థుడు.

అవునన్నట్టు తల వూగించి చంద్రమోహనుడు వృక్షం

మొగసాల గుర్రం దిగగానే గ్రామస్థుడు అతన్ని వెంటబెట్టుకుని సత్రం లోపలికి వెళ్ళాడు.

రద్దీని తప్పించుకుంటూ గ్రామస్థుడు చంద్రమోహనుడితో కూడా జ్యోతిష్కుడి దగ్గరికి వెళ్ళాడు.

అప్పుడే తనకు ఆ జ్యోతిష్కుడు చెప్పిన ఫలితాలకు సంతృప్తి చెందుతూ ఓ గ్రామస్థుడు ప్రక్కకు తప్పుకోవడంతో, మరో వ్యక్తి కూర్చోబోయాడు. గ్రామస్థుడు అతన్ని వారిస్తూ, "రంగయ్యా! మనం ఇక్కడి వాళ్ళమే. ఎప్పుడైనా చెప్పించుకోవచ్చు ఇదిగో— ఈ బాబుగారు చాలా దూరంనుండి వచ్చారు" అన్నాడు.

జ్యోతిష్కుడు ఆ గ్రామస్థుడి మాటలను వింటూనే, అతడి ప్రక్కనవున్న చంద్రమోహనుడ్ని చూశాడు. అతడు నమస్కరించాడు

జ్యోతిష్కుడు కుడిచెయ్యి పైకెత్తి అతన్ని దీవిస్తూనే "రా నాయనా! ఇలా కూర్చో" అన్నాడు.

చంద్రమోహనుడు ఆ జ్యోతిష్కుని ఎదుట పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు

జ్యోతిష్కుడు కొన్ని క్షణాలు కళ్ళు మూసుకుని, ఏదో ధ్యానించి, ఆ తర్వాత కళ్ళు తెరచి చంద్రమోహనుడి ముఖాన్ని ప్రశాంత దృష్టితో కొంతసేపు వీక్షించాడు.

కొన్ని క్షణాలు తదేకంగా చూసి, తనలో తానే ఏదో గుణించుకుని, అనంతరం ఇలా చెప్పాడు -

"నాయనా! నువ్వు ఓ మిత్రుడితో వియోగం పొందావు. అతడొక పవిత్రమైన లక్ష్యంతో పురోగమిస్తున్నాడు. ధర్మ



స్వరూపుడూ, మహావీరుడూ అయిన ఆ రాజపుత్రుడు ఇప్పుడు తన లక్ష్యాన్ని సాధించి తిరోగమనం చేస్తున్నాడు. భూమ్యాకాశాల మధ్యలో ప్రయాణిస్తున్న ఆ వీరుడు క్షేమంగా వున్నాడు."

జ్యోతిష్కుడి మాటలు చంద్రమోహనుడిలో ఉత్తేజాన్ని కలిగించాయి

అతడి ముఖంలో ఆనందం వెల్లివిరిసింది.

"స్వామీ! మా జయంతుడు భూమ్యాకాశాల మధ్య ప్రయాణిస్తున్నాడా? అంటే ఏమిటి? దయచేసి వివరాలు చెప్పండి" అన్నాడు చంద్రమోహనుడు.

"అతడు కాళీమాత అనుగ్రహంవల్ల కొన్ని దివ్యశక్తులను పొందాడు. నువ్వు ఉత్తరదిశగా ప్రయాణిస్తే రేపు ప్రాతఃకాలానికి క్షీర సముద్రం దగ్గరికి చేరుకుంటావు. ఆ సముద్రం ఒడ్డుదాకా పర్వత పంక్తులు నీకు గుర్తు సూచిస్తాయి. పర్వత పంక్తుల ప్రక్కన అరణ్యదారుల్లో వెళ్ళి, సముద్రం ఒడ్డునేవున్న పెద్ద మర్రి చెట్టు దగ్గరికి చేరుకో. నీకు శుభం కలుగుతుంది. ఇక అంతకంటె చెప్పాలిసింది లేదు నాయనా!" అని చెప్పాడు జ్యోతిష్కుడు.

ఆ తర్వాత—

చంద్రమోహనుడు జ్యోతిష్కుడికి నమస్కరించి తనను జ్యోతిష్కుడి దగ్గరికి తీసికెళ్ళిన గ్రామస్థుడి భుజం తట్టి చెప్పి అక్కణ్ణుంచి గుర్రం దగ్గరికి నడిచాడు.

మనస్సు పరిపూర్ణమైన సంతోషంతో పొంగిపోతూ ఉండగా

అతడు అశ్వాన్ని అధిరోహించి, అక్కడినుంచి జ్యోతిష్కుడు చెప్పిన దిశగా పరుగుతీయించాడు.

* * *

చంద్రమోహనుడు ఆ ఇసుకదిబ్బల పైగా గుర్రాన్ని నడిపిస్తూ, తీరం వెంట అలాగే మరికొంతదూరం ప్రయాణించాడు.

అల్లంత దూరంలో ఓ బ్రహ్మాండమైన మర్రిచెట్టు కనిపించింది అతడికి.

జ్యోతిష్కుడు తనకు చెప్పిన మర్రి చెట్టు అదేనన్న ఉద్వేగంతో చంద్రమోహనుడు గుర్రాన్ని ఆ చెట్టు దగ్గరికి నడిపించాడు

బ్రహ్మాండమైన ఆ మర్రిచెట్టు క్రిందికి గుర్రాన్ని నడిపించి, అప్పుడే ఆ మర్రి చెట్టు మొదలుకు కట్టివేసివుంచి తన గుర్రాన్ని చూస్తూ ఆనందంతో సకిలిస్తూ దగ్గరగా వచ్చిన ఓ గుర్రాన్ని చూసి చంద్రమోహనుడు ఆశ్చర్యంతో కిందికి చూశాడు.

కొత్త గుర్రం చంద్రమోహనుడి గుర్రాన్ని మోరతో తడుముతూ మెల్లిగా సకిలిస్తూ ఆప్యాయతను ప్రదర్శించసాగింది.

చంద్రమోహనుడి గుర్రం కూడా ఆ గుర్రంతో ముచ్చటలాడుతోన్నట్లు మెల్లిగా సకిలిస్తూ, ఆ గుర్రం ముఖాన్ని తన ముఖంతో తడమసాగింది

ఆ గుర్రాల పలకరింపులకు చంద్రమోహనుడు మరింత ఆశ్చర్యపోతూ కొత్త గుర్రాన్ని పరిశీలనగా చూశాడు.



అది జయంతపాలుడి గుర్రం!

చంద్రమోహనుడు జయంతుని గుర్రాన్ని చేత్తో మెల్లిగా నిమురుతూ, అది తనను కూడా గుర్తించి చిన్నగా సకిలిస్తుండగా ఆప్యాయంగా దానికేసి చూడసాగాడు.

ఆ సమయంలో — ప్రచండమైన ఎండ వేడిమి కలిగిన మర్రిచెట్టు ఎండుకొమ్మలు ఒకదానికొకటి రాసుకోవటంవల్ల ఏర్పడిన అగ్ని గాలి తనకు తోడుకాగా ఊడలమీద మర్రి చెట్టునంతా ఆక్రమించి దహించసాగింది.

ఆ విపరీతం ఏర్పడగానే అంతవరకు ఆనందంతో చంద్రమోహనుణ్ణి చూస్తూవున్న జయంతుడి గుర్రం చంద్రపాలుడి చేతిని నోట పట్టుకుని మర్రిచెట్టు తొర్ర దగ్గరికి తీసుకెళ్ళింది. ఆ తర్వాత తొర్రలోపలికి మెడ పెట్టి, తొర్రలో వున్న ఆకులను ప్రక్కకు తొలగించింది

అప్పుడు కనిపించింది చంద్రమోహనుడికి జయంతుడి శరీరం! అతడికంతా అయోమయమనిపించింది. అప్పటికే అగ్నికీలలు తొర్రను సమీపించటంతో చంద్రమోహనుడు జయంతుడి శరీరాన్ని తీసుకుని ప్రక్కకు వచ్చాడు. అశ్వం కూడా అతడి వెనకనే కదిలింది.

చంద్రమోహనుడు జయంతుడి శరీరాన్ని ఓ చెట్టు క్రింద పచ్చటి గడ్డిమీద వుంచి ఆ పరిస్థితిని గురించి ఆలోచించసాగాడు

బుద్ధికుశలుడైన అతడి మెదడులో జ్యోతిష్కుడు చెప్పిన మాటలు మెదిలాయి. కాళీమాత అనుగ్రహం పొంది జయంతుడు దివ్యశక్తులు పొందాడు. ఏదో ప్రయోజనాన్ని దృష్టిలో

వుండుకొని జయంతుడే తన శరీరాన్ని మర్రిచెట్టు తొర్రలో భద్రపరచివుంటాడు. మరి, ఇప్పుడు జయంతుడు ఏ రూపంలో వుండి భూమ్యాకాశాల మధ్య ప్రయాణిస్తున్నట్లు?....

చంద్రమోహనుడు అలా ఆలోచిస్తూండగానే అతడి తల మీద ఓ పెద్ద ధ్వని వినపడటంతో తల పైకెత్తి చూశాడు.

సువిశాలములైన రెక్కలను విప్పుకుని ఠీవిగా ఆనందంగా చూస్తూ క్రిందికి దిగుతోన్న ఓ గండభేరుండం అతడి దృష్టిలో పడింది. ఆ గండభేరుండం మీద ఓ యువతి కూర్చునివుండటం చూశాడు చంద్రమోహనుడు.

గండభేరుండం క్రిందికి దిగింది. ఆ పక్షిరాజు మూపున కూర్చునివున్న యువతి కూడా క్రిందికి దిగింది.

అనంతరం గండభేరుండం చంద్రమోహనుడ్ని చూస్తూ మనుష్యవాక్కులతో "చంద్రా! నువ్వు సమయానికి ఇక్కడికి చేరుకుని నీ మిత్రుడి శరీరాన్ని కాపాడుకున్నావు. ఈ యువతి రంగపురద్వీప మహారాజైన సత్యశీల మహారాజుగారి పుత్రిక జయంతిదేవి ప్రతిరూపమైన ఈమె ప్రేమను పొందనిదే జయంతికి శాప విముక్తి కలిగించలేను. అందువల్లనే కళింగపట్టణంలో కొంతకాలం వుండి, రకరకాల రూపాలతో అక్కడ కొన్ని సాహసాలు చేసి, ఈ సుహాసిని ప్రేమను పొందాను. జయంతికి శాపవిముక్తి కలిగించే వైశ్యాపర పుష్పాన్ని సాధించి తీసుకుని వస్తూండగా, ఒకచోట ఓ మాంత్రికుడు సుహాసినిని బలిపెడుతూండటం చూసి ఆ దుష్టుణ్ని హతమార్చి ఈమెను కాపాడాను" అని చెప్పి ఆ యువతి సుహాసినీ రాకుమారి ఆనందాశ్చర్యాలలో తనను



చూస్తూండగా, చంద్రమోహనుడు విభ్రాంతుడౌతూండగా జయంతపాలుడు పక్షిరూపాన్ని తొలగించుకుని, తన ఆత్మను తన శరీరంలో ప్రవేశపెట్టాడు.

చంద్రమోహనుడు మిత్రుణ్ని గట్టిగా కౌగిలించుకుని "ఆశ్చర్యా! ఎంత వింత కథ జరిగిందయ్యా, మిత్రమా! భగవంతుడు నిజంగా వున్నాడని ఇప్పటికి నాకు రూఢి అయింది" అన్నాడు ఆనందంతో.

సుహాసిని "జయంతా!" అని తన ప్రియుణ్ని కౌగిలించుకుని మురిసిపోయింది!

• • •

అత్యద్భుత సాహసం చేసి తనకు శాపవిముక్తి కలిగించిన జయంతపాలుడి వివాహానికి జయంతి తన తండ్రితోనూ దేవేంద్రుడితోనూ, దేవగణాలతోనూ వచ్చింది.

అచ్చం తన పుత్రికలాగే వున్న సుహాసినిని చూసి ఇంద్రుడు ముచ్చటపడి, సుహాసినికి మానవలోక దుర్లభమైన కామకళను కానుకగా ఇచ్చినట్లు చెప్పాడు.

జయంతపాలుడి సాహస గాథను స్వర్ణపుర ప్రజలు కథలుగా చెప్పుకుంటూండగా, శ్రీరంగపుర ప్రభువైన సత్యశీల మహారాజు సమక్షంలో స్వర్ణపుర ప్రభువు సుహాసినీ జయంతపాలుర వివాహం మహావైభవంగా జరిపించాడు.

—శుభం—